



Truth of News

RNI NO : APTEL/25/A0239

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS

irspublications12@gmail.com

సంపుటి: 01 | చిత్తూరు | సంచిక : 101 | ఆదివారం 14 సెప్టెంబర్ 2025 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi



## రష్యాపై ఆంక్షలకు రెడీ.. కానీ..!

- నాటో దేశాలకు ట్రంప్ షరతులు!
- రష్యాపై కఠిన ఆంక్షలకు సిద్ధమని ప్రకటించిన డొనాల్డ్ ట్రంప్
- నాటో దేశాలు రష్యా నుంచి చమురు కొనుగోలు ఆపాలని షరతు
- ఈ మేరకు నాటో మిత్రదేశాలకు లేఖ రాసిన అమెరికా అధ్యక్షుడు
- యుద్ధం ముగిసే వరకు చైనాపై 100 శాతం టారిఫ్‌లు విధించాలని మరో ప్రతిపాదన
- ఇది బైడెన్, జెలెన్‌స్కీల యుద్ధమంటూ ట్రంప్ విమర్శలు
- తన షరతులు అంగీకరించకపోతే సమయం వృథా చేయొద్దని స్పష్టీకరణ

రష్యా- సూర్య వాస్తవం, సెప్టెంబర్ 13

రష్యాపై కఠినమైన ఆంక్షలు విధించడానికి తాను సిద్ధంగా ఉన్నానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. అయితే, దీనికి నాటో మిత్రదేశాలన్నీ ఏకతాటిపైకి వచ్చి కొన్ని కీలకమైన షరతులను అంగీకరించాల్సి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. రష్యా నుంచి చమురు కొనుగోళ్లను పూర్తిగా నిలిపివేయడంతో పాటు, నాటో దేశాలు - మిగతా 2లో..



## ‘ఆపరేషన్ సిందూర్’లో మన ఆయుధాలే మనల్ని కాపాడాయి

- ఉగ్రవాదాన్ని ప్రోత్సహించేవారికి మన సైన్యం గుణపాఠం చెప్పిందన్న ప్రధాని
- దేశ రక్షణకు తయారీ రంగం చాలా ముఖ్యమన్న మోదీ
- మణిపూర్ సైనికుల త్యాగాలను కొనియాడిన ప్రధాని

ఇంఫాల్ - సూర్య వాస్తవం, సెప్టెంబర్ 13

దేశంలో తయారైన ఆయుధాలే ‘ఆపరేషన్ సిందూర్’ సమయంలో దేశాన్ని కాపాడాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. ఈ ఆపరేషన్‌లో 2లో

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

## రష్యాలో భారీ భూకంపం..

- సునామీ హెచ్చరిక జారీ
- కమ్చత్కా తీరంలో భారీ భూకంపం
- రిక్టర్ స్కేల్‌పై 7.4గా తీవ్రత నమోదు
- ధ్రువీకరించిన యూఎస్ జియోలాజికల్ సర్వే

రష్యా- సూర్య వాస్తవం, సెప్టెంబర్ 13




రష్యా తూర్పు తీరంలోని కమ్చత్కా ద్వీపకల్పంలో ఈ ఉదయం భారీ భూకంపం సంభవించింది. దీని తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 7.4గా నమోదైనట్లు యునైటెడ్ స్టేట్స్ జియోలాజికల్ సర్వే (యూఎస్‌జీఎస్) ప్రకటించింది. ఈ శక్తిమంతమైన భూకంపం నేపథ్యంలో అధికారులు సమీప తీర ప్రాంతాలకు సునామీ హెచ్చరికలు జారీ చేయడంతో ప్రజలు ఆందోళనకు గురయ్యారు. యూఎస్‌జీఎస్ వెల్లడించిన వివరాల ప్రకారం కమ్చత్కా ప్రాంత పరిపాలనా కేంద్రమైన - మిగతా 2లో..

## వైమానిక దాడిలో 19 మంది చిన్నారులు మృతి

నేపిడా - సూర్య వాస్తవం, సెప్టెంబర్ 13

పశ్చిమ రఖినే రాష్ట్రంలో జుంటా వైమానిక దాడిలో చిన్నారులతో సహా 19 మంది మృతి చెందారని మయన్మార్ జాతి మైనారిటీ సాయుధ బృందం శనివారం తెలిపింది. గత ఏడాది కాలంలో రఖినేలో కొంత భాగాన్ని స్వాధీనం చేసుకున్న అరకాన్ ఆర్మీ (ఎఎ) మయన్మార్ పాలక సైన్యంతో భీకర పోరాటం చేస్తోంది. క్యుక్తావ్ టౌన్‌షిప్‌లోని రెండు ప్రైవేటు ఉన్నత పాఠశాలలపై శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత జరిగిన దాడిలో 15-



21 సంవత్సరాల మధ్య వయసులు గల విద్యార్థులు మృతి చెందగా.. 22మంది గాయాల పాలయ్యారని - మిగతా 2లో..

## ఏపీ అక్రమ తరలింపును ఆధారాలతో సహా కృష్ణా ట్రైబ్యునల్ ముందుంచాలి

- కృష్ణా జలాల్లో న్యాయమైన వాటాను సాధించి తీరాలన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- రాష్ట్ర ప్రయోజనాలను పరిరక్షించేందుకు బలమైన వాదనలు వినిపించాలని వ్యాఖ్య
- నీటి వాటాను సాధించడంలో కేసీఆర్ విఫలమయ్యారని ఆరోపణ



హైదరాబాద్ - సూర్య వాస్తవం, సెప్టెంబర్ 13

కేసీఆర్ నిర్లక్ష్యం కారణంగానే ఆంధ్రప్రదేశ్ కృష్ణా జలాలను తరలించుకుపోయిందని, ఏపీ అక్రమ తరలింపును ఆధారాలతో సహా కృష్ణా జల వివాదాల ట్రైబ్యునల్ ముందు నివేదించాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. కృష్ణా జలాల్లో తెలంగాణ రాష్ట్రానికి న్యాయమైన వాటా సాధించి తీరుతామని ఆయన స్పష్టం చేశారు. ఈ నెల 23 నుంచి 25 వరకు ఢిల్లీలో కృష్ణా జల వివాదాల ట్రైబ్యునల్ విచారణ జరగనున్న నేపథ్యంలో, ట్రైబ్యునల్ ముందు వినిపించాల్సిన వాదనలపై నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కృష్ణా జలాల్లో తెలంగాణ రాష్ట్రానికి రావాల్సిన నీటి వాటాను సాధించేందుకు గట్టిగా పట్టుబట్టాలని అధికారులకు సూచించారు. రాష్ట్ర ప్రయోజనాలను పరిరక్షించేందుకు అవసరమైన బలమైన వాదనలను వినిపించాలని ఆయన అన్నారు. కృష్ణా నదిపై చేపట్టిన ప్రాజెక్టుల వివరాలన్నింటినీ ట్రైబ్యునల్ ముందుంచాలని ఆదేశించారు. గతంలో సరైన శ్రద్ధ కనబరచకపోవడం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని ఆయన అన్నారు. కృష్ణా జలాల్లో వాటా సాధించడంలో కేసీఆర్ విఫలమయ్యారని, నీటి వాటాల విషయంలో ఆయన తెలంగాణకు ద్రోహం చేశారని విమర్శించారు. పాలమూరు, దిండి వంటి అనేక ప్రాజెక్టులను పెండింగ్‌లో ఉంచారని ఆరోపించారు.



## పదేళ్లుగా చూస్తున్నాం... అలాంటి వారి ఉచ్చులో పడవద్దు

- ప్రజల మధ్య వైషమ్యాలు సృష్టించే కుట్రలకు పాల్పడుతున్నారన్న పవన్ కల్యాణ్
- సోషల్ మీడియా, యూట్యూబ్ చానెళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచన
- రెచ్చగొట్టే వారిపై చట్టపరంగానే చర్యలు తీసుకోవాలని కార్యకర్తలకు పిలుపు
- మచిలీపట్నం వివాదంపై అంతర్గత విచారణకు జనసేనాని ఆదేశం

అమరావతి - సూర్య వాస్తవం, సెప్టెంబర్ 13

రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతున్న తరుణంలో ప్రజల మధ్య వైషమ్యాలు సృష్టించి అశాంతిని కలిగించేందుకు కుట్రలు జరుగుతున్నాయని, వీటి పట్ల ప్రజలు, - మిగతా 2లో..

## శాంతిభద్రతలకు ప్రాధాన్యం ఇవ్వండి...

- పెట్టుబడులకు అదే కీలకం
- జిల్లా ఎస్పీలకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం
- శాంతిభద్రతల పరిరక్షణకే అత్యంత ప్రాధాన్యత అని స్పష్టీకరణ
- రాజకీయ ముసుగులో నేరాలను ఉపేక్షించవద్దని కఠిన హెచ్చరిక
- వివేకా హత్య, సింగయ్య మృతి కేసులను అధ్యయనం చేయాలని సూచన
- దర్యాప్తులో టెక్నాలజీ వాడకం పెంచాలని ఆదేశం
- ‘రియాక్ట్, రీచ్, రెస్పాండ్, రిజల్ట్’ విధానాన్ని పాటించాలని పోలీసులకు పిలుపు



అమరావతి - సూర్య వాస్తవం, సెప్టెంబర్ 13

రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తామని, ఈ విషయంలో ఎలాంటి రాజీకి తావులేదని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. శాంతి భద్రతలు పటిష్టంగా ఉంటేనే రాష్ట్రానికి పెట్టుబడులు వస్తాయని, తద్వారా యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు మెరుగుపడి రాష్ట్ర వృద్ధి రేటు పెరుగుతుందని ఆయన - మిగతా 2లో..



## కలర్‌షైన్ ఫ్యాక్టరీలో భారీ ప్రమాదం

- జింక్ ద్రావణం పడి కార్మికుడు మృతి
- మరో 10 మందికి తీవ్ర గాయాలు

గూడూరు - సూర్య వాస్తవం, సెప్టెంబర్ 13

తిరుపతి జిల్లా గూడూరు రూరల్ పరిధిలోని ‘కలర్‌షైన్’ ఫ్యాక్టరీలో శనివారం భారీ ప్రమాదం చోటుచేసుంది. ఈ ప్రమాదంలో జింక్ ద్రావణం మీద పడి ఒక కార్మికుడు చనిపోయారు. మరో పది మందికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను తొలుత నెల్లూరు జిల్లా ఆసుపత్రికి తరలించారు. కొందరి పరిస్థితి విషమించడంతో చెన్నయ్‌లోని ఓ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు, కార్మికులు తెలిపిన వివరాల - మిగతా 2లో..

# రష్యాలో భారీ భూకంపం..

(మొదటిపేజీ తరువాయి)

పెట్రోపావ్లోవ్స్క్-కమ్చాట్స్కీ నగరానికి తూర్పున 111 కిలోమీటర్ల దూరంలో, సముద్ర గర్భంలో 39.5 కిలోమీటర్ల లోతున భూకంప కేంద్రం ఉన్నట్లు గుర్తించారు. భూకంపం సంభవించిన వెంటనే పసిఫిక్ సునామీ హెచ్చరికల కేంద్రం అప్రమత్తమైంది. భూకంప కేంద్రానికి 300 కిలోమీటర్ల పరిధిలోని రష్యా తీర ప్రాంతాలపై ప్రమాదకరమైన అలలు విరుచుకుపడే అవకాశం ఉందని హెచ్చరించింది. అయితే, భూకంప తీవ్రతను యూఎస్‌జీఎస్ తొలుత 7.5గా అంచనా వేసినప్పటికీ, తరువాత దానిని 7.4కు సవరించింది. గత జులై నెలలో కూడా ఇదే ప్రాంతంలో 8.8 తీవ్రతతో అత్యంత శక్తిమంతమైన భూకంపం సంభవించిన విషయం తెలిసిందే. ఆ సమయంలో పసిఫిక్ అంతటా సునామీ అలలు ఎగసిపడటంతో హవాయి నుంచి జపాన్ వరకు పలు దేశాలు తీర ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాయి.

# రష్యాపై ఆంక్షలకు రెడీ.. కానీ..!

(మొదటిపేజీ తరువాయి)

కూడా సొంతంగా ఆంక్షలు అమలు చేస్తేనే తాను ముందుకు వెళతానని తేల్చి చెప్పారు. ఈ మేరకు నాటో దేశాలన్నింటికీ ట్రంప్ ఒక లేఖ రాశారు. ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో రష్యా, చైనాలకు వ్యతిరేకంగా ఉమ్మడి చర్యలు తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ లేఖ వివరాలను తన సామాజిక మాధ్యమ వేదిక 'ట్రూత్ సోషల్'లో ట్రంప్ పోస్ట్ చేశారు. "రష్యాపై కఠిన ఆంక్షలు విధించడానికి నేను సిద్ధం. కానీ నాటో దేశాలన్నీ కూడా అదే పని చేయాలి. మాస్కో నుంచి చమురు కొనడం పూర్తిగా ఆపేయాలి. మీరు సిద్ధమని చెబితే చాలు, నేను రంగంలోకి దిగుతాను" అని ట్రంప్ తన లేఖలో పేర్కొన్నారు. కొన్ని నాటో దేశాలు రష్యా నుంచి చమురు కొనుగోలు చేయడాన్ని ఆయన "దిగ్భ్రాంతికరం" అని అభివర్ణించారు. ఈ చర్య మాస్కోపై బేరసారాల శక్తిని తీవ్రంగా బలహీనపరుస్తుందని ఆయన విమర్శించారు. ఇదే సమయంలో చైనాను లక్ష్యంగా చేసుకుని మరో సంచలన ప్రతిపాదన చేశారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ముగిసే వరకు నాటో దేశాలన్నీ కలిసి చైనాపై 50 నుంచి 100 శాతం టారిఫ్‌లు విధించాలని సూచించారు. ఇలా చేయడం ద్వారా రష్యాపై చైనాకున్న బలమైన పట్టును విచ్ఛిన్నం చేయవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా బైడెన్ పరిపాలనపై ట్రంప్ విమర్శలు గుప్పించారు. "ఇది ట్రంప్ యుద్ధం కాదు. అప్పుడు నేను అధ్యక్షుడిగా ఉంటే ఇది మొదలయ్యేదే కాదు! ఇది బైడెన్, జెలెన్‌స్కీల యుద్ధం. నేను కేవలం దీన్ని ఆపడానికి, వేలాది మంది రష్యన్, ఉక్రెనియన్ల ప్రాణాలను కాపాడటానికి మాత్రమే ఉన్నాను" అని ఆయన వ్యాఖ్యానించారు. తాను ప్రతిపాదించిన చర్యలు తీసుకుంటే యుద్ధం త్వరగా ముగుస్తుందని, లేదంటే తన సమయాన్ని, అమెరికా సమయాన్ని, శక్తిని, డబ్బును వృథా చేయవద్దని ట్రంప్ పేర్కొన్నారు.

### 'ఆపరేషన్ సిందూర్'లో

# మన ఆయుధాలే మనల్ని కాపాడాయి

(మొదటిపేజీ తరువాయి)

భారత సైన్యం కనబరిచిన ధైర్యసాహసాలను, నైపుణ్యాన్ని ఆయన ప్రశంసించారు. శనివారం మిజోరం రాజధాని ఐజ్వాల్, మణిపూర్ రాజధాని ఇంఫాల్‌లో జరిగిన సభల్లో ప్రధాని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'ఆపరేషన్ సిందూర్' ద్వారా మన సైనికులు ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే వారికి గట్టి గుణపాఠం చెప్పారని అన్నారు. ఈ ఆపరేషన్‌లో మన సైన్యం ప్రదర్శించిన శక్తిని, పరాక్రమాన్ని యావత్ ప్రపంచం చూసిందని తెలిపారు. "ఈ విజయంలో 'మేడ్ ఇన్ ఇండియా' ఆయుధాలు అత్యంత కీలక పాత్ర పోషించాయి. దేశ భద్రతకు మన ఆర్థిక వ్యవస్థ, తయారీ రంగం బలోపేతం కావడం చాలా ముఖ్యం" అని మోదీ వివరించారు. దేశం గర్వపడేలా మన సైనికులు పాకిస్థాన్ సైన్యంపై నిర్ణయాత్మక దెబ్బ తీశారని ఆయన పేర్కొన్నారు. ఇంఫాల్‌లోని చారిత్రక కాంగ్లా కోటలో జరిగిన సభలో ప్రధాని మాట్లాడుతూ, మణిపూర్‌కు చెందిన ఎందరో బిడ్డలు దేశ రక్షణలో భాగంగా సరిహద్దుల్లో సేవలు అందిస్తున్నారని కొనియాడారు. 'ఆపరేషన్ సిందూర్'లో మణిపూర్ వీరుల పాత్ర ఎంతో గొప్పదని అన్నారు. ఈ ఆపరేషన్‌లో ప్రాణత్యాగం చేసిన అమర జవాన్ దీపక్ చింగ్‌ఖామ్ ధైర్యసాహసాలకు సెల్యూట్ చేస్తున్నట్లు తెలిపారు. దీపక్ చింగ్‌ఖామ్ త్యాగాన్ని దేశం ఎప్పటికీ గుర్తుంచుకుంటుందని మోదీ ఉద్ఘాటించారు. బీఎస్ఎఫ్ 7వ బెటాలియన్ కు చెందిన 25 ఏళ్ల దీపక్ చింగ్‌ఖామ్, జమ్ములోని ఆర్ఎస్ పురా సెక్టార్‌లో అంతర్జాతీయ సరిహద్దు వద్ద మే 10న జరిగిన కాల్పుల్లో తీవ్రంగా గాయపడి మరుసటి రోజు అసువులు బాసినట్లు ప్రభుత్వం గతంలో వెల్లడించింది. ఆయనతో పాటు మణిపూర్‌కే చెందిన స్క్వాడ్రన్ లీడర్ రిజ్వాన్ మాలిక్‌కు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 'వీర్ చక్ర' పురస్కారాన్ని ప్రకటించారు. ఈ ఇద్దరు వీరులకు మణిపూర్ ప్రభుత్వం రూ. 10 లక్షల చొప్పున బహుమతిని కూడా ప్రకటించింది.

### కలర్‌షైన్ ఫ్యాక్టరీలో

# భారీ ప్రమాదం

(మొదటిపేజీ తరువాయి)

ప్రకారం.. తిరుపతి జిల్లా గూడూరు రూరల్ పరిధిలోని తుంగపాలెంలో 'కలర్‌షైన్' పరిశ్రమ ఉంది. ఇందులో రంగురంగుల లేటెస్టు రేకులను తయారు చేస్తుంటారు. జింక్‌పాట్ (తొట్టె) వద్ద 600 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత ఉంటుంది. హైడ్రోజన్ ఎంత వాల్యూమ్ ఉందో తెలుసుకునేందుకు సల్ఫర్ రాడ్‌ను వెలిగిస్తారు. అందులో గ్యాస్ తక్కువ మోతాదులో ఉంటే ఎటువంటి ఇబ్బందీ ఉండదు. ఎక్కువ మోతాదులో గ్యాస్ నిల్వలు ఉంటే ప్రమాదం. శనివారం ఎప్పటిలాగే హైడ్రోజన్ వాల్యూమ్ ఎంత ఉందో గుర్తించే ప్రయత్నం చేయగా గ్యాస్ నిల్వలు ఎక్కువగా ఉండడంతో ఒత్తిడికి గురై జింక్‌పాట్ ఒక్కసారిగా పగిలిపోయింది. జింక్ ద్రావణం మొత్తం వెదజల్లి అక్కడ ఉన్న పది మంది మెయింటినెన్స్ డిపార్టుమెంట్ కార్మికులపై పడింది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఆదిత్యకుమార్ (30) జింక్‌పాట్‌లో పడి శరీరం పూర్తిగా ద్రవంలో కరిగిపోయింది. శ్యాంసుందర్, సతీష్‌కుమార్, అమాన్‌దివేది, సోమియాపాండా, హీరేంద్రప్రతాప్ సింగ్, బబ్బులు భగత్, శశికాంత్ మిశ్రా, విక్కీకుమార్, గణేష్‌రారు, అభ్యకుమార్ సింగ్‌కు గాయాలవడంతో నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వీరిలో ఐదుగురికి తీవ్ర గాయాలవడంతో మెరుగైన చికిత్స కోసం చెన్నరు ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారిలో ఓ కార్మికునికి కంట్లో జింక్ ద్రావణం పడడంతో కన్ను పోయినట్లు సమాచారం. గూడూరు రూరల్ సిఐ కిషోర్‌బాబు మీడియాతో మాట్లాడుతూ పరిశ్రమలో అగ్ని ప్రమాదం జరిగిందని, ఒకరు మృతిచెందారని, ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఆదిత్యకుమార్ చనిపోయినట్లుగా గుర్తించామని తెలిపారు. సంఘటనా స్థలాన్ని తహశీల్దార్ ప్రసాద్ పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. మృతుడు ఆదిత్యకుమార్‌కు భార్య, మూడేళ్ల బాబు, మూడు నెలల పాప ఉన్నారు. మృతదేహం కరిగిపోవడంతో తోటి కార్మికులు కన్నీటి పర్యంతమయ్యారు. భార్య బాధ వర్ణనాతీతం. మృతుని కుటుంబానికి రూ.50 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని, కుటుంబ పోషణకు ప్రతినెలా కొంత నగదును కంపెనీ నుంచి కుటుంబ సభ్యులకు అందజేయాలని డిమాండ్ చేస్తున్నారు. గాయపడిన క్షతగాత్రులకు రూ.25 లక్షల చొప్పున ఇవ్వాలని, మెరుగైన చికిత్స అందించి వారిని కాపాడాలని కోరుతున్నారు.

### శాంతిభద్రతలకు

# ప్రాధాన్యం ఇవ్వండి...

(మొదటిపేజీ తరువాయి)

అన్నారు. జిల్లాల ఎస్పీలతో బదిలీల అనంతరం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన పలు కీలక అంశాలపై దిశానిర్దేశం చేశారు. రాజకీయ ము సుగులో నేరాలకు పాల్పడే వారిని ఎట్టిపరిస్థితుల్లోనూ ఉపేక్షించవద్దని కఠినంగా హెచ్చరించారు.

**నేర రాజకీయాలకు వివేకా హత్య, సింగయ్య మృతి కేసులే నిదర్శనం**

ప్రస్తుత సమాజంలో నేరాల స్వరూపం మారిందని, రాజకీయాలను అడ్డుపెట్టుకుని నేరాలు చేసే సంస్కృతి పెరిగిపోయిందని ముఖ్యమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. "గతంలో రాజకీయ నాయకులు తమ అవసరాల కోసం నేరస్థులను వాడుకునేవారు. కానీ ఇప్పుడు నేరస్థులే రాజకీయ ముసుగు వేసుకుంటున్నారు. దీనికి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసే అతిపెద్ద ఉదాహరణ. ఆ హత్యను మొదట గుండెపోటుగా చిత్రీకరించారు, ఆ తర్వాత నాపై నెట్టే ప్రయత్నం చేశారు. సీబీఐ విచారణ కావాలని అడిగి, ఆ తర్వాత వద్దన్నారు. ఒకే కేసులో ఇన్ని మలుపులు దేశంలో మరెక్కడా చూసి ఉండరు. ఇది ప్రతి పోలీసు అధికారి అధ్యయనం చేయాల్సిన కేస్ స్టడీ," అని చంద్రబాబు వివరించారు.

అలాగే, ఇటీవల జరిగిన సింగయ్య మృతి ఘటనను కూడా ఆయన ప్రస్తావించారు. "సొంత పార్టీ కార్యకర్త తమ కారు కింద పడి చనిపోతే, ఆ విషయాన్ని రెండు రోజుల పాటు దాచిపెట్టారు. వీడియోలు బయటకు రాకపోతే ఆ నిజం తెలిసేదే కాదు. పైగా, బాధిత కుటుంబంతోనే ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడించారు. ఇలాంటి క్రిమినల్ రాజకీయాలు నడుస్తున్న రోజుల్లో మనం ఉన్నామన్నది అధికారులు గుర్తించాలి," అని సీఎం అన్నారు.

**గత అనుభవాలతో శాంతిభద్రతల పటిష్టత**

తాను గతంలో ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఫ్యాక్షనిజం, నక్సలిజం, రౌడీయిజం వంటి సమస్యలను ఉక్కుపాదంతో అణచివేశానని చంద్రబాబు గుర్తుచేశారు. "రాయలసీమలో ఫ్యాక్షన్‌ను రూపుమాపడానికి మా పార్టీ ప్రజాప్రతినిధులను సైతం అరెస్టు చేయించాను. అంత కఠినంగా వ్యవహరించడం వల్లే అది సాధ్యమైంది. బెజవాడలో రౌడీయిజాన్ని సమర్థులైన అధికారులతో అరికట్టాం. నాడు హైదరాబాద్‌లో శాంతిభద్రతలను కాపాడటం వల్లే నేడు అదొక బ్రాండ్‌గా నిలిచింది," అని తెలిపారు. నక్సలిజంపై కఠినంగా వ్యవహరించినందుకే తనపై అలిపిరిలో దాడి జరిగిందని, అయినా తాను వెనక్కి తగ్గలేదని సీఎం అన్నారు.

**టెక్నాలజీతో నేరాల ఛేదన**

మారుతున్న కాలానికి అనుగుణంగా పోలీసు వ్యవస్థ కూడా అప్‌డేట్ కావాలని చంద్రబాబు సూచించారు. "దర్యాప్తులో టెక్నాలజీని 100 శాతం ఉపయోగించుకోవాలి. టెక్నాలజీతోనే ఉత్తమ ఫలితాలు వస్తాయి. పాస్టర్ ప్రవీణ్ మృతి కేసులో సీసీటీవీ ఫుటేజ్ లేకపోతే, ఆ నెపాన్ని ప్రభుత్వానికి అంటగట్టేవారు. టెక్నాలజీ సాయంతోనే వాస్తవాలు నిరూపించగలిగాం," అని ఆయన అన్నారు. సోషల్ మీడియాలో రెచ్చిపోతున్న సైకోలను, మహిళల వ్యక్తిత్వాన్ని కించపరిచే వారిని కఠినంగా అణచివేయాలని ఆదేశించారు.

**'4ఆర్' విధానంతో ఉత్తమ పోలీసింగ్**

పోలీసులు "రియాక్ట్, రీచ్, రెస్పాండ్, రిజల్ట్" అనే '4ఆర్' విధానాన్ని పాటించాలని సీఎం పిలుపునిచ్చారు.

**రియాక్ట్:** ఘటన జరిగిన వెంటనే స్పందించాలి.

**రీచ్:** నేర స్థలానికి స్వయంగా చేరుకుని పర్యవేక్షించాలి.

**రెస్పాండ్:** మీడియా, సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు ప్రచారాలపై వెంటనే స్పందించి వాస్తవాలు వెల్లడించాలి.

**రిజల్ట్:** ప్రతి కేసులోనూ వేగంగా దర్యాప్తు పూర్తిచేసి ఫలితాలు రాబట్టాలి.

ఈ విధానాన్ని స్టేషన్ హౌస్ ఆఫీసర్ నుంచి ఉన్నతాధికారి వరకు పాటిస్తే రాష్ట్రంలో ఉత్తమ పోలీసింగ్ సాధ్యమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రజలతో స్నేహపూర్వకంగా ఉంటూనే, అసాంఘిక శక్తులు భయపడేలా పనిచేయాలని సూచించారు. తప్పు చేస్తే ఏ పార్టీ వారైనా వదిలిపెట్టవద్దని, ఈ విషయంలో ఎలాంటి రాజీ లేదని స్పష్టం చేశారు. రాష్ట్ర భవిష్యత్తుకు శాంతిభద్రతలే పునాది అని, ఈ బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తించి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని ఎస్పీలకు చంద్రబాబు పిలుపునిచ్చారు.

### పదేళ్లుగా చూస్తున్నాం...

# అలాంటి వారి ఉచ్చులో పడవద్దు

(మొదటిపేజీ తరువాయి)

జనసేన, కూటమి శ్రేణులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హెచ్చరించారు. రెచ్చగొట్టే ప్రకటనలు, అభ్యంతరకర వ్యాఖ్యలు చేసే వారి ఉచ్చులో పడకుండా, చట్టపరమైన మార్గాల్లోనే ముందుకు వెళ్లాలని ఆయన స్పష్టమైన పిలుపునిచ్చారు. సామాజిక మాధ్యమాలు, యూట్యూబ్ చానెళ్ల ముసుగులో కొందరు కుల, మతాల మధ్య చిచ్చు పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని పవన్ ఆరోపించారు. ఇలాంటి కుయుక్తులతో సమాజంలో అభద్రతను సృష్టించే వారి నైజాన్ని గత పదేళ్లుగా చూస్తూనే ఉన్నామని గుర్తుచేశారు. ఆవేశాలకు లోనై ఘర్షణలకు దిగితే కుట్రదారుల లక్ష్యం నెరవేరుతుందని, కాబట్టి సంయమనం పాటించాలని ఆయన సూచించారు.

ఇటీవల మచిలీపట్నంలో జరిగిన ఘటనే ఇందుకు నిదర్శనమని పవన్ పేర్కొన్నారు. ఓ యూట్యూబ్ చానెల్ లో ఒక వ్యక్తితో ఉద్దేశపూర్వకంగా అభ్యంతరకర భాషలో మాట్లాడించి, దానిని ప్రచారం చేయడం వెనుక ఉన్న దుష్ట ఆలోచనను గ్రహించాలన్నారు. దీనిపై చట్టప్రకారం కేసులు నమోదు చేసి ముందుకెళ్లాలే తప్ప, తొందరపడి ఘర్షణలకు దిగితే సమస్య మరింత జటిలమవుతుందని ఆయన విశ్లేషించారు. ఇలాంటి పరిస్థితులను ఆసరాగా చేసుకుని నాయకులు బయటకు వచ్చి ప్రజలను రెచ్చగొట్టే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో మచిలీపట్నం వివాదంపై అంతర్గత విచారణ జరపాలని పార్టీ నాయకులను ఆదేశించినట్లు పవన్ కల్యాణ్ తెలిపారు. ఈ ఘటనలో పాలుపంచుకున్న వారికి నోటీసులు జారీ చేసి వివరణ తీసుకోవాలని స్పష్టం చేశామన్నారు. విశ్లేషకులు, సోషల్ మీడియా ముసుగులో రెచ్చగొట్టే వారితో పాటు, వారి వెనుక ఉండి వ్యవస్థీకృతంగా కుట్రలు చేసే వారిపై కూడా భారత న్యాయ సంహిత ప్రకారం ఫిర్యాదులు చేసి కేసులు నమోదు చేయించాలని జనసేన, కూటమి నాయకులకు, కార్యకర్తలకు ఆయన దిశానిర్దేశం చేశారు. దుష్ప్రచారాలను ప్రజాస్వామ్యయుతంగా, చట్టబద్ధంగానే తిప్పికొడదామని పవన్ కల్యాణ్ అన్నారు.

# పవన్ కల్యాణ్‌కు ఓట్లేసింది సినిమా షూటింగ్స్ చేసుకోవడానికా ?

### - మాజీ మంత్రి ఆర్కే రోజా

**నగరి- సూర్య వాస్తవం, సెప్టెంబర్ 13**



" పవన్ కల్యాణ్‌కు ఓట్లేసింది సినిమా షూటింగ్స్ చేసుకోవడానికా ? " అని వైసిపి నేత, మాజీ మంత్రి ఆర్కే రోజా ప్రశ్నించారు. శనివారం చిత్తూరు జిల్లా నగరిలో ఆమె మీడియాతో మాట్లాడుతూ ప్రజలు పవన్ కల్యాణ్‌కు ఓట్లేసింది సినిమా షూటింగ్స్ చేసుకోవడానికా ? అని ప్రశ్నించారు. ప్రభుత్వ స్పెషల్ ఫ్లైట్లలో చక్కర్లు కొట్టడానికి జనం ఆయనకు అధికారం ఇవ్వలేదన్నారు. రాష్ట్రంలో అన్నదాతలు యూరియా అందక అష్టకష్టాలు పడుతున్నారని, కనీసం వారిని పట్టించుకున్న పాపాన పోలేదని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వంలో భాగస్వామ్యంగా ఉన్నప్పుడు పవన్.. ప్రజా సమస్యలపై సిఎం చంద్రబాబును నియదీయాల్సిందేనన్నారు. కానీ, చంద్రబాబు కొనిచ్చిన హెలికాప్టర్‌లో పవన్ షికార్లు కొడుతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో 17 మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేస్తుంటే కనీసం పవన్ ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. కానీ, ప్రజలంతా ఇప్పుడు పవన్‌కు ఎందుకు ఓట్లు వేశాం రా బాబు.. అంటూ బాధపడుతున్నారని ఆర్కే రోజా ధ్వజమెత్తారు.

### వైమానిక దాడిలో

# 19 మంది చిన్నారులు మృతి

(మొదటిపేజీ తరువాయి)

అరకాన్ ఆర్మీ శనివారం టెలిగ్రామ్ పోస్టులో తెలిపింది. ఈ ఘటనపై ఎఎ విచారం వ్యక్తం చేసింది. అయితే ఈ ఘటనపై ఎఎకి చెందిన సభ్యులెవరూ మీడియాకు వెల్లడించలేదు. జుంటా యుద్ధ విమానం ఒక ఉన్నత విద్యా పాఠశాలపై 500 పౌడ్ల బాంబులను విసిరింది. ఆ సమయంలో పాఠశాలలోని విద్యార్థులు నిద్రిస్తున్నారు అని లోకల్ మీడియా అవుట్‌లెట్ మయన్మార్ తెలిపింది.

కాగా, ఈ బాంబు దాడిని యునిసెఫ్ తీవ్రంగా ఖండించింది. రఖినే రాష్ట్రంలో పెరుగుతున్న వినాశకరమైన హింసకు పిల్లలు, కుటుంబాలు భారీ మూల్యం చెల్లిస్తున్నాయి అని యూనిసెఫ్ ప్రకటనలో పేర్కొంది. క్యౌక్తావ్ చుట్టుపక్కల ప్రాంతాలలో ఇంటర్నెట్, ఫోన్ సేవలు అస్తవ్యస్తంగా ఉండడంతో మీడియా అక్కడికి చేరుకోలేకపోయింది. మయన్మార్‌ని సైన్యమే పరిపాలిస్తుంది. దీంతో సైన్యం పాలనను ప్రజలు వ్యతిరేకించడంతో.. పౌర సమాజాలను దెబ్బతీసేందుకు ఫిరంగి దాడులకు పాల్పడుతుందని మిలటరీపై ఆరోపణలున్నాయి.

# వార్నింగ్‌లతో సరా...

**గుంటూరు- సూర్య వాస్తవం, సెప్టెంబర్ 13**



వైసీపీ అధినేత వైఎస్ జగన్ దూకుడు పెంచారు. జనంలోకి వెళ్లడమే కాకుండా ప్రభుత్వ నిర్ణయాలు అమలు కాకుండా వార్నింగ్ ల మీద వార్నింగ్ లు ఇస్తున్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రయివేటు పరం చేయడాన్ని జగన్ తప్పు పడుతున్నారు. తమ హయాంలో జిల్లాకు ఒక మెడికల్ కళాశాలను ఏర్పాటు చేయడానికి అవసరమైన భవనాలను నిర్మించామని, మౌలిక వసతులు కూడా అనేక కళాశాలల్లో కల్పించామని, కొన్ని చోట్ల మెడికల్ కళాశాలలో తరగతులు కూడా ప్రారంభమయ్యాయని జగన్ చెప్పుకొచ్చారు. ఇప్పుడు ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రయివేటు పరం చేయడానికి చంద్రబాబు నాయుడు పెద్ద స్కామ్ కు తెరలేపారని ఆరోపించారు. తన సొంత మనుషులకు మెడికల్ కళాశాలలను కట్టబెట్టడానికే ఈ నిర్ణయం తీసుకున్నారని దీని వెనక పెద్ద మొత్తంలో ముడుపులు చేతులు మారే అవకాశముందని ఆరోపించారు. అదే సమయంలో చంద్రబాబు నాయుడు కూడా అదే స్థాయిలో కౌంటర్ ఇచ్చారు. ప్రభుత్వ వైద్య కళాశాలలను ఏర్పాటు చేయడం అంటే కేవలం భూములను కేటాయించడమే కాదని, అందుకు అవసరమైన అన్ని రకాలుగా వసతులతో పాటు ఫ్యాకల్టీని, అవసరమైన సామగ్రిని సిద్ధం చేయాల్సిన గత ప్రభుత్వం మొండి గోడలను వదిలేసిందన్నారు. ఇంత భారీ సంఖ్యలో మెడికల్ కళాశాలలను ఏర్పాటు చేసి, వాటిని నిర్వహించడం ప్రభుత్వానికి భారంగా మారుతుందని కూటమి నేతలు చెబుతున్నారు. అందుకే పీపీపీ మోడల్ లో ప్రయివేటు వారికి అప్పగిస్తే తప్పేమిటని ప్రశ్నిస్తున్నారు. ప్రతి మెడికల్ కళాశాలలో యాభై శాతం సీట్లు కన్వీనర్ కోటా కింద ఉంటాయని, పేద విద్యార్థులకు ఇది ఉపయోగమేనని వారు వాదిస్తున్నారు. ప్రభుత్వం నిర్వహించేకంటే ప్రయివేటు వ్యక్తుల చేతుల్లో నాణ్యమైన వైద్య విద్య అందుతుందని అంటున్నారు.అధికారంలోకి వస్తే అయితే జగన్ మాత్రం తాము తిరిగి అధికారంలోకి వస్తే తిరిగి ప్రభుత్వ పరం చేసుకుంటామని హెచ్చరించారు. ఎవరూ టెండర్లలో పాల్గొనవద్దని కూడా ఆయన పరోక్షంగా చెప్పారు. ఒకవేళ మెడికల్ కళాశాలను ఇప్పుడు తీసుకున్నా మూడేళ్ల తర్వాత తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వారి నుంచి ఖచ్చితంగా తీసుకుంటామని చెబుతున్నారు. అంటే ఒకరకంగా ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూనే అందుకు ముందుకు వచ్చే వ్యక్తులపై కూడా బెదిరింపులకు దిగుతున్నట్లు కనిపిస్తుందని కూటమి నేతలు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రజలు స్వాగతిస్తున్నారని, బెదిరిస్తే ఎవరూ భయపడే వారు లేరని అంటున్నారు. ఇదే సమయంలో ఖచ్చితంగా పబ్లిక్, ప్రయివేట్ పార్ట్ నర్ షిప్ పద్ధతిలో వైద్య కళాశాలలను నిర్వహిస్తామని కూటమి సర్కార్ చెబుతుంది. మొత్తం మీద ఏపీలో మెడికల్ వార్ మొదలయిందనే అనుకోవాలి. జగన్ కూడా స్వయంగా ఆందోళనల్లోకి దిగుతామని హెచ్చరించి ఈ అంశానికి మరింతగా పొలిటికల్ హీట్ పెంచినట్లయింది.

# సంపాదకీయం

## కేంద్ర కేబినెట్ విస్తరణ ఊహాగానాలు

### - ఏపీ నుంచి ఇద్దరికి ఛాన్స్



ఉపరాష్ట్రపతి ఎన్నికలు పూర్తయ్యాయి. తదుపరి బీహార్‌తో పాటు తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలపై దృష్టి పెట్టనుంది బిజెపి. బీహార్ లో నితీష్ కుమార్ నేతృత్వంలో ఎన్డీఏ, తమిళనాడులో అన్న డీఎంకేతో పొత్తు ద్వారా అధికారంలోకి రావాలని బిజెపి భావిస్తోంది. అయితే ఇప్పుడు మిత్రుల ద్వారా ముందుకెళ్లాలని చూస్తున్న బిజెపి.. కేంద్ర మంత్రివర్గాన్ని విస్తరించి మిత్రులకు పదవులు కేటాయించాలని చూస్తోంది. బీహార్లో జెడియుకు మంత్రివర్గంలో స్థానం ఇవ్వనుంది. తమిళనాడు నుంచి బిజెపి మాజీ చీఫ్ అన్నామలైకు మంత్రి పదవి ఇచ్చేందుకు సుముఖంగా ఉంది. ఇంకోవైపు ఏపీ నుంచి ఒకరిని కేంద్రమంత్రి వర్గంలోకి తీసుకోవాలని చూస్తోంది. అదే జరిగితే మూడు పార్టీల్లో ఎవరికి అవకాశం దక్కుతుంది అన్నది ప్రశ్నగా మిగులుతోంది.ఏపీ నుంచి ప్రస్తుతం ముగ్గురు మంత్రులు ఉన్నారు. బిజెపి నుంచి నరసాపురం ఎంపీ భూపతి రాజు శ్రీనివాస్ వర్మ, తెలుగుదేశం పార్టీ నుంచి కింజరాపు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్ ఉన్నారు. అయితే కేంద్ర మంత్రివర్గం తూర్పు సమయంలోనే జనసేనకు అవకాశం ఇచ్చారు ప్రధాని నరేంద్ర మోడీ. అప్పట్లో కేంద్ర మంత్రివర్గంలో చేరేందుకు పవన్ కళ్యాణ్ పెద్దగా సుముఖత వ్యక్తం చేయలేనట్టు తెలుస్తోంది.

అయితే ఇప్పుడు మంత్రివర్గ విస్తరణలో ఛాన్స్ ఇస్తే దక్కించుకోవాలని పవన్ భావిస్తున్నట్లు సమాచారం. ఆ పార్టీకి రెండుచోట్ల ఎంపీలు ఉన్నారు. మచిలీపట్నం నుంచి జనసేన తరఫున గెలిచిన బాలసౌరి సీనియర్. జనసేనకు గాని ఆ పదవి కేటాయిస్తే బాలసౌరికి అవకాశం దొరికి పరిస్థితి ఉంటుంది. లేకుంటే మాత్రం నాగబాబును కేంద్ర రాజకీయాల్లోకి పంపించాలని పవన్ భావిస్తే ఆయన మంత్రి పదవి చేపట్టే అవకాశం ఉందితెలుగుదేశం పార్టీకి సంబంధించి ఇప్పటికే ఇద్దరు మంత్రులు ఉన్నారు. కింజరాపు రామ్మోహన్ నాయుడుకేంద్రంలో కీలకమైన పౌర విమానయాన శాఖను దక్కించుకున్నారు. గుంటూరు ఎంపీ చంద్రశేఖర్ మాత్రం సహాయ మంత్రి పదవితో ఉన్నారు. తెలుగుదేశం పార్టీకి కేటాయిస్తే మాత్రం రాయలసీమ ప్రాంతానికి చెందిన ఎంపీకి అవకాశం ఇచ్చే పరిస్థితి కనిపిస్తోంది. ఈ లెక్కన హిందూపురం, చిత్తూరు ఎంపీల పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. ఒకవేళ రెడ్డి సామాజిక వర్గానికి ఇవ్వదలుచుకుంటే నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డికి చంద్రబాబు అవకాశం ఇస్తారని తెలుస్తోంది.బిజెపికి సంబంధించి ఇప్పటికే నరసాపురం ఎంపీ భూపతి రాజు శ్రీనివాస వర్మ కేంద్ర సహాయ మంత్రిగా ఉన్నారు. మరోసారి బిజెపికి అవకాశం ఇవ్వాలనుకుంటే ప్రముఖంగా పురందేశ్వరి పేరు వినిపిస్తోంది. మొన్నటి వరకు ఆమె ఏపీ బీజేపీ చీఫ్ గా ఉండేవారు. కేంద్రమంత్రి పదవి కారణంగానే ఆమెను తప్పించారని అప్పట్లో ప్రచారం నడిచింది. ఒకవేళ సామాజిక సమీకరణల దృష్ట్యా పురందేశ్వరికి అవకాశం రాకుంటే మాత్రం.. అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ కు ఛాన్స్ ఇస్తారని తెలుస్తోంది. అయితే ఏ పార్టీకి ఇస్తారో తెలియదు కానీ ఏపీ నుంచి మరో కేంద్రమంత్రి పదవి ఖాయమని టాక్ నడుస్తోంది. ఉపరాష్ట్రపతిఎన్నికలు పూర్తయ్యాయి.

తదుపరి బీహార్ తో పాటు తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలపై దృష్టి పెట్టనుంది బిజెపి. బీహార్ లో నితీష్ కుమార్ నేతృత్వంలో ఎన్డీఏ, తమిళనాడులో అన్న డీఎంకేతో పొత్తు ద్వారా అధికారంలోకి రావాలని బిజెపి భావిస్తోంది. అయితే ఇప్పుడు మిత్రుల ద్వారా ముందుకెళ్లాలని చూస్తున్న బిజెపి.. కేంద్ర మంత్రివర్గాన్ని విస్తరించి మిత్రులకు పదవులు కేటాయించాలని చూస్తోంది. బీహార్లో జెడియుకు మంత్రివర్గంలో స్థానం ఇవ్వనుంది. తమిళనాడు నుంచి బిజెపి మాజీ చీఫ్ అన్నామలైకు మంత్రి పదవి ఇచ్చేందుకు సుముఖంగా ఉంది. ఇంకోవైపు ఏపీ నుంచి ఒకరిని కేంద్రమంత్రి వర్గంలోకి తీసుకోవాలని చూస్తోంది. అదే జరిగితే మూడు పార్టీల్లో ఎవరికి అవకాశం దక్కుతుంది అన్నది ప్రశ్నగా మిగులుతోంది.ఏపీ నుంచి ప్రస్తుతం ముగ్గురు మంత్రులు ఉన్నారు. బిజెపి నుంచి నరసాపురం ఎంపీ భూపతి రాజు శ్రీనివాస్ వర్మ, తెలుగుదేశం పార్టీ నుంచి కింజరాపు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్ ఉన్నారు. అయితే కేంద్ర మంత్రివర్గం తూర్పు సమయంలోనే జనసేనకు అవకాశం ఇచ్చారు ప్రధాని నరేంద్ర మోడీ. అప్పట్లో కేంద్ర మంత్రివర్గంలో చేరేందుకు పవన్ కళ్యాణ్ పెద్దగా సుముఖత వ్యక్తం చేయలేనట్టు తెలుస్తోంది.


అయితే ఇప్పుడు మంత్రివర్గ విస్తరణలో ఛాన్స్ ఇస్తే దక్కించుకోవాలని పవన్ భావిస్తున్నట్లు సమాచారం. ఆ పార్టీకి రెండుచోట్ల ఎంపీలు ఉన్నారు. మచిలీపట్నం నుంచి జనసేన తరఫున గెలిచిన బాలసౌరి సీనియర్. జనసేనకు గాని ఆ పదవి కేటాయిస్తే బాలసౌరికి అవకాశం దొరికి పరిస్థితి ఉంటుంది. లేకుంటే మాత్రం నాగబాబును కేంద్ర రాజకీయాల్లోకి పంపించాలని పవన్ భావిస్తే ఆయన మంత్రి పదవి చేపట్టే అవకాశం ఉంది. తెలుగుదేశం పార్టీకి సంబంధించి ఇప్పటికే ఇద్దరు మంత్రులు ఉన్నారు. కింజరాపు రామ్మోహన్ నాయుడు కేంద్రంలో కీలకమైన పౌర విమానయాన శాఖను దక్కించుకున్నారు. గుంటూరు ఎంపీ చంద్రశేఖర్ మాత్రం సహాయ మంత్రి పదవితో ఉన్నారు. తెలుగుదేశం పార్టీకి కేటాయిస్తే మాత్రం రాయలసీమ ప్రాంతానికి చెందిన ఎంపీకి అవకాశం ఇచ్చే పరిస్థితి కనిపిస్తోంది. ఈ లెక్కన హిందూపురం, చిత్తూరు ఎంపీల పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. ఒకవేళ రెడ్డి సామాజిక వర్గానికి ఇవ్వదలుచుకుంటే నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డికి చంద్రబాబు అవకాశం ఇస్తారని తెలుస్తోంది.బిజెపికి సంబంధించి ఇప్పటికే నరసాపురం ఎంపీ భూపతి రాజు శ్రీనివాస వర్మ కేంద్ర సహాయ మంత్రిగా ఉన్నారు. మరోసారి బిజెపికి అవకాశం ఇవ్వాలనుకుంటే ప్రముఖంగా పురందేశ్వరి పేరు వినిపిస్తోంది. మొన్నటి వరకు ఆమె ఏపీ బీజేపీ చీఫ్ గా ఉండేవారు. కేంద్రమంత్రి పదవి కారణంగానే ఆమెను తప్పించారని అప్పట్లో ప్రచారం నడిచింది. ఒకవేళ సామాజిక సమీకరణల దృష్ట్యా పురందేశ్వరికి అవకాశం రాకుంటే మాత్రం.. అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్‌కు ఛాన్స్ ఇస్తారని తెలుస్తోంది. అయితే ఏ పార్టీకి ఇస్తారో తెలియదు కానీ ఏపీ నుంచి మరో కేంద్రమంత్రి పదవి ఖాయమని టాక్ నడుస్తోంది. చూడాలి మరి ఏం జరుగుతుందో..

# నేడు హిందీ భాషా దినోత్సవం

హిందీ భాషా దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం సెప్టెంబరు 14 న జరుపుకుంటారు. భారత జాతీయోద్యమంలో అఖిల భారతాన్ని జాగృతం చేసి, ఏకతాటిపై నడిపేందుకు హిందీ భాష ఆనాడు దోహద పడినందున గాంధీజీ స్ఫూర్తితో 1949 సెప్టెంబరు 14న రాజ్యాంగంలోని 351 వ అధికరణం 8వ షెడ్యూల్‌లో హిందీని జాతీయభాషగా గుర్తిస్తూ పొందుపరిచారు.

అప్పటి నుంచి ప్రతి ఏటా ఈ రోజున హిందీ భాషా దినోత్సవాన్ని జరుపుకుంటారు. దేవనాగరి లిపిలో వ్రాయబడిన హిందీ భాషను రిపబ్లిక్ ఆఫ్ ఇండియా రెండు అధికారిక భాషలలో ఒకటిగా భారత రాజ్యాంగ సభచే జరుపుకుంటారు. ఈ మేరకు హిందీకి అనుకూలంగా బీహార్ రాజేంద్ర సింహాతో పాటు హజారీ ప్రసాద్ ద్వివేది, కాకా కలేల్కర్, మైథిలి శరణ్ గుప్త్, సేథ్ గోవింద్ దాస్ లు ర్యాలీలు చేసారు. అందుకని, 1949 సెప్టెంబర్ 14 న బీహార్ రాజేంద్ర సింహా 50 వ పుట్టినరోజున, హిందీని అధికారిక భాషగా స్వీకరించిన తరువాత వారి ప్రయత్నాలు ఫలించాయి. ఈ నిర్ణయం 1950 జనవరి 26 న అమల్లోకి వచ్చిన భారత రాజ్యాంగం ఆమోదించింది. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 343 ప్రకారం, దేవనాగరి లిపిలో వ్రాసిన హిందీని అధికారిక భాషగా స్వీకరించారు. మొత్తం మీద, భారతదేశంలో 22 షెడ్యూల్డ్ భాషలు ఉన్నాయి, వాటిలో రెండు అధికారికంగా యూనియన్ స్థాయిలో ఉపయోగించబడతాయి. హిందీ, ఇంగ్లీష్. ఆధునిక హిందీని నేడు 250 మిలియన్లకు పైగా ప్రజలు మొదటి భాషగా మాట్లాడుతున్నారు. భారత మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ న్యూఢిల్లీ లోని విజ్ఞాన్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో హిందీకి సంబంధించిన వివిధ రంగాలలో రాణించినందుకు వివిధ విభాగాలలో పురస్కారాలు ప్రధానం చేశారు. మంత్రిత్వ శాఖలు, విభాగాలు, పిఎస్‌యులు, జాతీయం చేసిన బ్యాంకులకు రాజ్‌భాషా పురస్కారాలు ప్రధానం చేశారు.

హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ 2015 మార్చి 25 నాటి ఉత్తర్వులలో హిందీ దివాస్‌పై ఏటా ఇచ్చే రెండు పురస్కారాల పేర్లను మార్చింది. 1986 లో స్థాపించబడిన "ఇందిరా గాంధీ రాజ్‌భాషా పురస్కార్"ను "రాజ్‌భాషా కీర్తి పురస్కార్"గా మార్చారు. 'రాజీవ్ గాంధీ రాష్ట్రీయ జ్ఞాన్-విజ్ఞాన్ మౌలిక్ పుస్తక్ లేఖన్ పురస్కార్' ను "రాజ్‌భాషా గౌరవ్ పురస్కార్"గా మార్చారు.





## హైదరాబాద్ రాష్ట్రానికి ఎన్నికైన

# తొలి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు

### -నేడు ఆయన వర్ధంతి

బూర్గుల రామకృష్ణారావు బహుభాషావేత్త, స్వాతంత్ర్యోద్యమ నాయకుడు, రచయిత, న్యాయవాది. హైదరాబాదు రాష్ట్రానికి ఎన్నికైన తొలి ముఖ్యమంత్రి. రెండు రాష్ట్రాలకు గవర్నరుగా కూడా పనిచేసాడు. రామకృష్ణరావు 1899 మార్చి 13 న నరసింగరావు, రంగనాయకమ్మ దంపతులకు మహబూబ్ నగర్ జిల్లా, తలకొండ పల్లి మండలం కల్వకుర్తి దగ్గరలోని పడకల్ గ్రామంలో జన్మించాడు. వీరి స్వగ్రామం బూర్గుల, ఇంటి పేరు పుల్లం రాజు వారు. అయితే స్వగ్రామమైన బూర్గుల నామమే వారి ఇంటిపేరుగా మారింది. ధర్మపంత్ స్కూలు (హైదరాబాద్) లో ప్రాథమిక విద్యను అభ్యసించాడు. 1915లో మెట్రిక్ పరీక్షలో ఉత్తీర్ణులయ్యాడు. పూణె లోని ఫెర్గూసన్ కళాశాలలో బీఏ (హానర్స్) డిగ్రీ చదివాడు. బొంబాయి విశ్వవిద్యాలయం నుంచి ఎల్ఎల్‌బీ (లా డిగ్రీ) పూర్తిచేసి, హైదరాబాద్‌లో న్యాయవాద వృత్తిని ప్రారంభించారు.



బూర్గుల దగ్గర పివినరసింహారావు జూనియర్ లాయర్‌గా పనిచేశాడు. బూర్గుల1924లో పెళ్ళి చేసుకున్నాడు. 1923లో హైదరాబాదులో న్యాయవాద వృత్తి ప్రారంభించి అగ్రస్థాయికి చేరాడు. న్యాయవాదిగా ఉంటూనే, రాజకీయాల్లో పాల్గొనడం జరిగింది. ఆంధ్రోద్యమం, గ్రంథాలయోద్యమం, భూదానోద్యమం మొదలైన వాటిలో పాల్గొన్నాడు. మాడపాటి హనుమంతరావు, సురవరం ప్రతాపరెడ్డి మొదలైన వారితో కలిసి పనిచేసాడు. శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయంకు అధ్యక్షుడిగా, కార్యదర్శిగా పనిచేసాడు. హైదరాబాదు రాష్ట్ర కాంగ్రెసు వ్యవస్థాపకుల్లో బూర్గుల ప్రముఖుడు. పార్టీ తరపున ఆయన అనేక కార్యక్రమాలకు నేతృత్వం వహించాడు. 1931లో నల్గొండ జిల్లా దేవరకొండలో జరిగిన రెండవ ఆంధ్రమహాసభకు బూర్గుల అధ్యక్షత వహించాడు. శాసనోల్లంఘన ఉద్యమంలోను, క్విట్ ఇండియా ఉద్యమంలోను పాల్గొని కారాగారవాసం అనుభవించాడు.

1948లో పోలీసు చర్య తరువాత హైదరాబాదు రాష్ట్రం ఏర్పాటు అయి, వెల్లోడి ముఖ్యమంత్రిగా సైనిక ప్రభుత్వం ఏర్పడినపుడు, ఆయన రెవిన్యూ, విద్యాశాఖల మంత్రి అయ్యాడు. రెవెన్యూ మంత్రిగా వినోబాభావే ప్రారంభించిన భూదానోద్యమానికి చట్టబద్ధత కల్పించాడు. 1948 జనవరిలో ప్రభుత్వ ఏజెంట్ జనరల్‌గా హైదరాబాద్ వచ్చిన కె.యం. మున్షీని నిజాం ఆజ్ఞలకు విరుద్ధంగా అందరికన్నా ముందే సందర్శించి పాలకుల ఆగ్రహానికి గురయ్యారు. ఆ సంవత్సరంలోనే హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ నాయకుడై ప్రజా ఉద్యమానికి సారథ్యం వహించాడు. హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనం కావడానికి కృషి సల్పిన తీరు విశేషమైనది. రాజకీయ రంగంలోనే కాకుండా సాంఘిక సాంస్కృతిక రంగాల్లో వీరు చేపట్టిన సేవ ప్రత్యేకమైనది. ఖాదీ బోర్డు విచారణ సంఘం, మధ్యప్రదేశ్ విషయ పరిశీలన సంఘం, ఆంధ్రప్రదేశ్ భారత్ సేవక సమాజం అధ్యక్షులుగా ఉన్నాడు. చరిత్ర, శాస్త్ర విజ్ఞానాల తెలుగు ఉర్దూ అకాడమీ, భారతీయ విద్యాభవన్, ప్రశాంతి విద్వత్ పరిషత్ అధ్యక్షులుగా గొప్ప సాంస్కృతిక సేవలందించాడు. క్లాసికల్ లాంగ్వేజి కమిషన్ సభ్యులుగా, దక్షిణ భారత హిందీ ప్రచార సభ, సంస్కృత పరిషత్‌ల ఉపాధ్యక్షులుగా భాషా సేవలు అందించాడు.


1952లో మొదటిసారి హైదరాబాదు రాష్ట్రానికి ఎన్నికలు జరిగినపుడు, మహబూబ్‌నగర్ జిల్లాలోని షాద్‌నగర్ నియోజకవర్గం నుంచి హైదరాబాద్ శాసనసభకు ఎన్నికయ్యాడు. ఆ ఏర్పడిన ప్రజాప్రభుత్వంలో ముఖ్యమంత్రి అయ్యాడు. పూర్తి మెజారిటీ లేకున్ననూ, మంత్రివర్గంలో సంపూర్ణ సహకారం లేకున్ననూ, పరిపాలన దక్షుడైన ముఖ్యమంత్రిగా పేరుగాంచాడు. 1956లో హైదరాబాదు రాష్ట్రంలోని తెలుగు మాట్లాడే ప్రాంతాలను విడదీసి, కోస్తా, రాయలసీమలతో కలిపి ఆంధ్ర ప్రదేశ్ ఏర్పాటు అయినపుడు, కొత్త రాష్ట్రానికి నీలం సంజీవరెడ్డి ముఖ్యమంత్రి అయ్యాడు. బూర్గుల, కేరళ రాష్ట్రానికి గవర్నరుగా వెళ్ళాడు. 1960 వరకు కేరళ గవర్నరుగా పనిచేసి, తరువాత 1962 వరకు ఉత్తర ప్రదేశ్ గవర్నరుగా పనిచేసాడు. 1953లో ఆంధ్ర విశ్వ విద్యాలయం అయనకు డాక్టర్ ఆఫ్ లిటరేచర్ గౌరవ పట్టాను ప్రదానం చేసింది. 1956లో ఉస్మానియా విశ్వ విద్యాలయం డాక్టర్ ఆఫ్ లాస్ అనే పట్టాను ఇచ్చింది. బూర్గుల 1967, సెప్టెంబర్ 14న గుండెపోటుతో మరణించాడు.

# బెజవాడలో డయేరియా...

**విజయవాడ - సూర్య వాస్తవం**

విజయవాడలోని న్యూ రాజరాజేశ్వరి పేటలో డయేరియా బాధితులు కోలుకుంటున్నారు. ఇప్పటి వరకు మొత్తం 115 కేసులు నమోదైనాయి. వీరిలో ప్రస్తుతం చికిత్స పొందుతున్నవారు 61 మంది. చికిత్స తీసుకొని మరో 54 మంది డిశ్చార్జ్ అయినారు. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా అక్కడ మెడికల్ క్యాంప్ కొనసాగుతుంది. డయేరియా కారణంగా స్థానికులు కాచి చల్లార్చిన నీరే తాగాలని వైద్యాధికారులు హెచ్చరికలు జారీ చేశారు. బాధితులకు మెడికల్ టెస్ట్‌లు కొనసాగుతున్నాయి. ఇక్కడి డయేరియా కేసుల పరిస్థితి నిలకడగా ఉన్నప్పటికీ ఓవైపు బాధితులు కోలుకుని ఇంటికి వెళ్తుంటే మరోవైపు కొత్త కేసులు నమోదవుతున్నాయి. న్యూ రాజరాజేశ్వరి పేట వైద్య శిబిరంలో ఈ రోజు కొత్తగా మరో ఐదుగురు అడ్మిట్ అయ్యారు. దీంతో 57వ డివిజన్ న్యూ రాజరాజేశ్వరి పేటలో సచివాలయాల వారీగా బృందాలు ఇంటింటి సర్వే చేస్తున్నాయి. ఎంపీడీవో స్థాయి అధికారి పర్యవేక్షణలో బృందాలుగా ఏర్పడి ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు. జ్వర పీడితులు, వాంతులు, విరేచనాలతో ఎవరైనా బాధపడుతున్నారా? అనే సమాచారాన్ని సేకరించే పనిలో అధికార గణం పని చేస్తుంది.పాత రాజరాజేశ్వరి పేటలో పెరుగుతున్న డయేరియా కేసులు.. ఇప్పటివరకు 100 దాటిన డయేరియా బాధితుల సంఖ్య. నిన్న రాత్రి మెడికల్ క్యాంప్‌లో 30 మంది చికిత్స కోసం వచ్చారు. మరికొందరు బాధితులు వైద్యానికి ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్తున్నారు. ఇప్పటికే పైప్‌లైన్ ద్వారా నీటి సరఫరా నిలిపివేసిన అధికారిక యంత్రాంగం.విజయవాడలోని న్యూరాజ రాజేశ్వరి పేటలో ప్రస్తుతం పరిస్థితి అదుపులోనే ఉందని వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ తెలిపారు. ప్రభుత్వ పరంగా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని ఆయన అన్నారు. మంచినీటి పైపులైన్, అండర్ గ్రౌండ్ నీటి నమూనాలను పరీక్షకు పంపించామన్నారు. మరోవైపు ల్యాబ్ రిపోర్ట్ నెగెటివ్ రావడంతో మంచినీటి సరఫరా కూడా నిలిపివేశామన్నారు. ఇప్పటి వరకు డయేరియాతో ఎవరూ చనిపోలేదని, వదంతులు నమ్మొద్దని మంత్రి సత్యకుమార్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.





### కర్నూలు జిల్లా కలెక్టర్‌గా
# సిరి బాధ్యతల స్వీకరణ




**కర్నూలు –సూర్య వాస్తవం, సెప్టెంబర్ 13:** కర్నూలు జిల్లా నూతన కలెక్టర్‌గా అట్టాడ సిరి శనివారం ఉదయం పదవీ బాధ్యతలు స్వీకరించారు. కలెక్టర్ ఛాంబర్లో ఉదయం 10.40 గంటలకు మత పెద్దలు సర్వమత ప్రార్థనలు చేసి, ఆమెను ఆశీర్వదించారు. పలువురు జిల్లా అధికారులు శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా సమగ్ర అభివృద్ధికి కలిసికట్టుగా కృషి చేద్దామని అధికారులకు పిలుపునిచ్చారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతీ లబ్ధిదారుడికి చేరేలా మనమందరం కృషి చేద్దామన్నారు.

### శ్రీ సత్యసాయి కలెక్టర్
# శ్యామ్ ప్రసాద్‌కు ఘన స్వాగతం





**పుట్టపర్తి – సూర్య వాస్తవం , సెప్టెంబర్ 13:** శ్రీ సత్యసాయి జిల్లా కొత్త కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ శనివారం మధ్యాహ్నం పుట్టపర్తి ప్రశాంతి నిలయాల్లోని శాంతిభవన్ చేరుకున్నారు. ఆయనకు జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, ఇంఛార్జి డీఆర్వో ఎం.రామసుబ్బయ్య, ఆర్డీఓలు సువర్ణ, మహేష్, శర్మ, తహసీల్దార్ కళ్యాణ చక్రవర్తి తదితరులు పుష్పగుచ్చాలు అందించి ఘన స్వాగతం పలికారు.

### అనంతపురం జిల్లా నూతన కలెక్టర్‌గా
# ఓ.ఆనంద్ బాధ్యతల స్వీకరణ



**అనంతపురం కలెక్టరేట్ – సూర్య వాస్తవం, సెప్టెంబర్ 13:** అనంతపురం జిల్లా నూతన కలెక్టర్‌గా ఓ.ఆనంద్ శనివారం మధ్యాహ్నం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ముందుగా కలెక్టరేట్‌కు చేరుకున్న నూతన జిల్లా కలెక్టర్‌కు డిఆర్ఓ ఏ.మలోల, కలెక్టరేట్ ఏవో అలెగ్జాండర్ పూల మొక్కలను అందజేసి ఘన స్వాగతం పలికారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఛాంబర్ కు చేరుకున్న నూతన జిల్లా కలెక్టర్ దేవుని పటానికి నమస్కరించారు. తదనంతరం నూతన జిల్లా కలెక్టర్‌గా ఓ.ఆనంద్ పదవీ బాధ్యతలు స్వీక రించారు. ఆ తరువాత పంపనూరు శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, పెన్న అహోబిలం శ్రీలక్ష్మీనర సింహస్వామి ఆలయ అర్చకులు జిల్లా కలెక్టర్ కు ఆశీర్వాదం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్‌కు ఆర్డీవోలు వసంత బాబు, శ్రీనివాస్, కేశవ నాయుడు, కలెక్టరేట్ సెక్షన్ల సుపరింటెండెంట్లు యుగేశ్వరి దేవి రియాజుద్దీన్, వసంతలత, వివిధ శాఖల జిల్లా అధికారులు పూల మొక్కలు, పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

**కలెక్టర్ ఓ.ఆనంద్‌కు ఘన స్వాగతం**

అనంతపురం జిల్లా నూతన కలెక్టర్ ఓ.ఆనంద్ శనివారం మధ్యాహ్నం అనంతపురం చేరుకున్నారు. నగరంలోని ఆర్.అండ్.బి అతిథి గృహంలో నూతన జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ కు జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, డిఆర్ఓ ఏ.మలోల, తహసీల్దార్ హరికుమార్, ఆర్.అండ్.బి ఎస్ఈ మురళీకృష్ణ, రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు, ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షులు దివాకర్ బాబు, తదితరులు పూలమొక్కలు, పుష్పగుచ్చాలు అందజేసి ఘన స్వాగతం పలికారు.

# విద్యార్థులకు ఆర్థిక సాయం

**విజయవాడ– సూర్య వాస్తవం, సెప్టెంబర్ 13:** లయన్స్ క్లబ్ ఆఫ్ నందిగామ వారి ఆధ్వర్యంలో ఇద్దరు పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం చేయుత. అనాసాగరం గ్రామానికి చెందిన పోలా గోపి శ్రీనివాస్ బీటెక్ ఫస్ట్ ఇయర్ చదువుకుంటున్న విద్యార్థి. మరియు తోటచర్ల గ్రామానికి చెందిన. పాపట్ల పూజిత. ఫిజియోథెరపీ చదువుకుంటున్న . బాలిక విద్యార్థికి శనివారం నాడు నందిగామ సీతారామాంజనేయ స్వామి దేవాలయంలో క్లబ్ అధ్యక్షులు. మలంపాటి ప్రసాదు,తొర్లికొండ సీతారామయ్య సౌజన్యంతో ఆర్థిక సహాయం అందించారు. చదువు మీద శ్రద్ధ ఉన్నప్పటికీ మంచి క్లవర్ స్టూడెంట్స్ అయినప్పటికీ వారి యొక్క ఆర్థిక స్థితిగతులు ఇబ్బంది పడుతున్న తరుణంలో చదువుకునే పిల్లలకు20.000.వేలు ఆర్థిక సహాయం చేయడం వల్ల వారి భవిష్యత్తు బాగుంటుందని చెప్పి ఈ సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో. మందడపు సీతారామయ్య. మారం సత్యనారాయణ. గోపు సుబ్రహ్మణ్యం, శ్రీనివాసరావు, ఆర్ఐ నరసింహారావు, పబ్బతి నరేంద్ర. కడియాల సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.




### ప్రభుత్వ వైద్య కళాశాలలపై
# హోమ్ మంత్రి అనిత వ్యాఖ్యలు పచ్చి అబద్ధం

- జీవో 590ని ఉపసంహరించుకోవాలి
- డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి



**వేంపల్లి – సూర్య వాస్తవం, సెప్టెంబర్ 13:** రాష్ట్రంలో ప్రభుత్వ వైద్య కళాశాలల భవనాలన్నీ పునాది దశలోనే ఉన్నాయని, వాటిని పూర్తి చేయాలంటే ఎక్కువ నిధులు అవసరమని, ప్రభుత్వం వద్ద అంత డబ్బు లేదని, అందువల్లనే ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటుపరం చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించిందని శుక్రవారం హోమ్ మినిస్టర్ అనిత వ్యాఖ్యానించడం చాలా దురదృష్టకరం అని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి అన్నారు. శనివారం వేంపల్లిలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఇందులో ఏ మాత్రం వాస్తవం లేదు .అనిత వ్యాఖ్యలు పచ్చి అబద్ధాలు. బొంకరా బొంకరా పోలిగా అంటే టంగుటూరి మిరియాలు తాటికాయంత అన్నట్లు ఉంది అనిత వ్యాఖ్యలు అని తులసి రెడ్డి ఎద్దేవా చేశారు. ఒకసారి పులివెందుల ప్రభుత్వ వైద్య కళాశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి తర్వాత మాట్లాడవలసిందిగా తులసి రెడ్డి అనితకు సూచించారు.

పులివెందుల ప్రభుత్వ వైద్య కళాశాలకు సంబంధించి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేనాటికి ఆసుపత్రి భవనాలు నూటికి నూరు శాతం పూర్తయ్యాయి .నర్సింగ్ కళాశాల భవనాలు నూటికి నూరు శాతం పూర్తయ్యాయి. మెడికల్ కళాశాల భవనాలు 60 శాతం పూర్తయ్యాయి. క్వార్టర్లు, మిగతా భవనాలు 60 శాతం పూర్తి అయ్యాయి. నేషనల్ మెడికల్ కమిషన్ సభ్యులు క్షేత్ర స్థాయిలో పులివెందుల ప్రభుత్వ వైద్య కళాశాలను పరిశీ లించిన తర్వాతనే అక్కడ ప్రభుత్వ వైద్య కళాశాల నిర్వహించేందుకు అన్ని హంగులు ఉన్నాయని భావించి 2024 ౼ 25 విద్యా సంవత్సరానికి 50 ఎంబిబిఎస్ సీట్లు కేటాయిస్తూ 2024 ఆగస్టు 16న లెటర్ ఆఫ్ పర్మిషన్ , అనగా అనుమతి పత్రం ఇవ్వడం జరిగింది. కానీ అప్పటికే ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటుపరం చేయాలనే దురుద్దేశం కూటమి ప్రభుత్వానికి ఉంది కాబట్టి 2024 సెప్టెంబర్ 11న పులివెందుల ప్రభుత్వ వైద్య కళాశాలకు మంజూరు చేసిన 50 ఎంబిబిఎస్ సీట్లు వద్దు అని రాష్ట్ర ప్రభుత్వం నేషనల్ మెడికల్ కమిషన్ కు లేఖ రాసింది. దీనివలన 2024 ౼ 25 విద్యా సంవత్సరానికి 50 ఎంబీబీఎస్ సీట్లు, 2025 ౼ 26 విద్యాసంవత్సరానికి మరో 150 ఎంబిబిఎస్ సీట్లు,మొత్తం 200 ఎంబిబిఎస్ సీట్లు రాష్ట్రం కోల్పోయిందని తులసి రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అదనంగా నూరు కోట్ల రూపాయలు ఖర్చు పెడితే పులివెందుల ప్రభుత్వ వైద్య కళాశాలకు సంబంధించిన అన్ని భవనాలు సర్వాంగ సుందరంగా పూర్తవుతాయి. 2025 – 26 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ మూడు లక్షల 22 వేల కోట్ల రూపాయలు. అందులో నుంచి నూరుకోట్ల రూపాయలు ఖర్చు పెడితే పులివెందుల ప్రభుత్వ వైద్య కళాశాల సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకుంటుంది .నూరు కోట్ల రూపాయలు ఖర్చుపెట్టలేని దీనావస్థలో కూటమి ప్రభుత్వం ఉందా అని తులసి రెడ్డి ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం వద్ద డబ్బు లేదనడం సాకు మాత్రమే. పులివెందుల ప్రభుత్వ వైద్య కళాశాల పరిసరాల్లో ఎకరా భూమి విలువ దాదాపు రెండు కోట్ల రూపాయల వరకు ఉంది .ప్రభుత్వ వైద్య కళాశాలకు కేటాయించిన భూమి 50 ఎకరాలు. అంటే మొత్తం భూమి విలువ నూరుకోట్ల రూపాయల వరకు ఉంటుంది. అలాంటిది కూటమి ప్రభుత్వం ప్రైవేట్ వ్యక్తులకు ఎకరాకు ?100 చొప్పున అంటే 50 ఎకరాలను కేవలం 5000 రూపాయలకు ప్రైవేట్ వ్యక్తులకు ఇవ్వాలని నిర్ణయించడం సిగ్గుచేటు. శ్రీకృష్ణ తులాభారం నాటకంలోని భలే మంచి చౌక బేరం అన్న పద్యము జ్ఞాపకానికి వస్తుందని తులసిరెడ్డి ఎద్దేవా చేశారు. వైద్య విద్యను ప్రైవేట్ పరం చేయడం, ఎంబిబిఎస్ సీట్లను అమ్ముకోవడం అనేది తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడైన ఎన్టీఆర్ ఆశయాలకు పూర్తి విరుద్ధం. ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటుపరం చేయడం వలన ప్రతిభ గలిగిన పేద విద్యార్థులు వైద్య విద్యకు దూరమవుతారు. దీనికి తోడు సంబంధిత ఆసుపత్రుల్లో రోగులు ఫీజులు చెల్లించాల్సి వస్తుంది. దీనివలన పేద రోగులు ఉచిత వైద్యానికి దూరమవుతారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం పునరాలోచించి ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటుపరం చేస్తూ జారీచేసిన జీవో 590ని వెంటనే ఉపసం హరించుకోవాలని తులసిరెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

**పీఎం మణిపూర్ పర్యటన**

రెండున్నర సంవత్సరాల క్రితం మణిపూర్ రాష్ట్రంలో మైతేయ, కుకీ జాతుల మధ్య ఘర్షణ కారణంగా దాదాపు 260 మంది మృతి చెందారు. వేలాది మంది నిరాశ్రయులయ్యారు. ఆ రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన పెట్టడం జరిగింది .అసెంబ్లీ సుప్త చేతనావస్థలో ఉంది .కానీ దురదృష్టవశాత్తు ఈ రెండున్నర సంవత్సరాలలో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఒక్కసారి కూడా ఆ రాష్ట్రంలో పర్యటించలేదు.

ప్రపంచంలోని వివిధ దేశాలలో అనేకసార్లు పర్యటించిన ప్రధానమంత్రి దేశంలో ఒక రాష్ట్రమైన మణిపూర్లో పర్యటించకపోవడం చాలా శోచనీయం. ఎట్టకేలకు శనివారం మణిపూర్ రాష్ట్రంలో ప్రధానమంత్రి పర్యటించడం హర్షనీయం. అత్త చచ్చిన ఆరు నెలలకు కోడలు వలవలా ఏడ్చింది అన్న సామెత గుర్తుకు వస్తా ఉంది. ఏది ఏమైనప్పటికీ కనీసం ఇప్పుడైనా ప్రధానమంత్రి గారు ఆ రాష్ట్రంలో పర్యటించడం హర్షనీయం అని తులసి రెడ్డి అన్నారు.

### మానవత్వం చాటిన
# కె.ఎస్.ఆర్ కాలేజీ విద్యార్థినులు ..

- కాళ్లు పుచ్చి.. పురుగులు పట్టి..
- దయనీయ పరిస్థితుల్లో.. కదలలేని స్థితిలో ఓ వృద్ధుడి నరకయాతన
- అమ్మా ఆకలి.. అయ్యా ఆకలి..అంటూ కేకలు
- చలించిన ఇంటర్ విద్యార్థుల మనస్సు
- అక్కున చేర్చుకుని..ఆకలి తీర్చి.. ఆటోలో ఆస్పత్రికి తరలింపు
- విద్యార్థినులను అభినందించిన ఆర్.ఎం.ఓ డాక్టర్ హేమలత



**ఏడు పదుల వయస్సు దాటిన ఓ వృద్ధుడు..అందరూ ఉండి అనాథగా మారాడు. వయస్సు మీద పడటంతో కుటుంబ సభ్యుల నిరాదరణకు గురయ్యాడు. అనారోగ్యం పట్టిపీడించింది. షుగర్ సహా ఇతర దీర్ఘ కాలిక వ్యాధులు చుట్టుముట్టాయి. ఎలాగోలా అనంతపురం చేరుకున్నాడు. కాళ్లు పుచ్చిపోయి కదల్లేని స్థితిలో ఇక్కడి జెడ్పీ సమీపంలో రోడ్డు పక్కన పడిపోయాడు. నాలుగు రోజులుగా పచ్చి మంచి నీళ్లు కూడా ముట్టుకోలేదు. దానికీ తోడు ఎటువంటి ఆహారం కూడా తీసుకోకపోవడంతో ఆకలితో కేకలు పెట్టడం అటు వెళ్తున్న కె.ఎస్.ఆర్ ఇంటర్ కళాశాలకు చెందిన నలుగురు విద్యార్థులను కదిలించింది. అతని ఆకలి తీర్చి..ఆటోలో ఆస్పత్రికి తరలించి మానవత్వం చాటుకున్నారు.**

**అనంతపురం క్రైం – సూర్య వాస్తవం, ఆగస్టు 13:** శ్రీ సత్యసాయి జిల్లా బుక్కపట్నం మండలం పాముదుర్తికి చెందిన సత్యనారాయణ(70) అనంతపురంలోని కె.ఎస్. ఆర్. ఇంటర్ కళాశాల సమీపంలో నాలుగు రోజు లుగా దిక్కులేని వాడిగా పడిపోయారు. కదలలేని స్థితిలో ఉన్న అతన్ని అటు, ఇటు వెళ్తున్న ఏ ఒక్కరూ పట్టించుకున్న పాపాన పోలేదు. అయితే కె.ఎస్.ఆర్ ఇంటర్ కళాశాలకు చెందిన ఇంటర్ మొదటి సంవత్సరం చదివే త్రివేణి, కల్యాణి, శిరీష, లల్లీశ్రీ అనే విద్యార్థినులు ముందుకొచ్చి ఆ వృద్ధుడిని ఆటోలో ఆస్పత్రికి తరలించి ప్రాణాపాయం నుంచి తప్పించారు.

**కాళ్లు పుచ్చి..పురుగులు పట్టి..**

కుటుంబ సభ్యుల నిరాదరణకు గురైన సత్యనారాయణ వయస్సు రీత్యా వచ్చిన దీర్ఘకాలిక వ్యాధులతో పాటు చక్కెర వ్యాధితో బాధపడుతున్నారు. సరైన వైద్యం లేక కాళ్లు పిచ్చిపోయాయి. పురుగులు పట్టి రాలుతున్నాయి. చూడ్డానికే భయంకరమైన పరిస్థితి. ఒకవైపు కాళ్ళ నొప్పి, మరోవైపు కడుపులో ఆకలితో మెలికలు తిరిగిపోతున్నా.. అటువైపు ఎంత మంది రాకపోకలు సాగిస్తున్న సత్యనారాయణను ఏ ఒక్కరూ పట్టించుకోలేదు. చూసిన వారంతా అయ్యో.పాపం అంటూ నిట్టూర్పు వదలడమే గానీ కడుపుకింత ఆకలి తీర్చిన వారు గానీ, ఆస్పత్రికి తరలించిన వారు గానీ లేకపోయారు.

**దేవుడి రూపంలో వచ్చిన విద్యార్థినులు**

నాలుగు రోజులుగా కాళ్లు పూర్తిగా పుచ్చి పురుగులు రాలుతున్నా.. విపరీతమైన ఆకలితో కేకలు పెడుతున్న తీరు ఏ ఒక్కరినీ కదిలించలేకపోయాయి. సరిగ్గా ఈ సమయంలోనే అటు వైపు వచ్చిన కె.ఎస్.ఆర్ ఇంటర్ కళాశాల విద్యార్థినులు వృద్ధుడి నరకయాతన చూసి చలించిపోయారు. వెనకా ముందు ఆలోచించలేదు. తమ వద్ద పైసలతో హోటల్ నుంచి టిఫిన్ తెచ్చి అతని ఆకలి తీర్చారు. ఆ తరువాత ఆటోలో పెద్దాసుపత్రికి తరలించారు. అయితే సంతకాలు పెడితేనే చేర్చుకుంటామంటూ అక్కడి సిబ్బంది తెగేసి చెప్పారు. అక్కడ కొంచెం భయపడ్డ విద్యార్థులు ఆర్.ఎం.ఓ డాక్టర్ గుజ్జల హేమలత దృష్టికి తీసుకెళ్లారు.

**ఆర్.ఎం.ఓ డాక్టర్ గుజ్జల హేమలత చొరవతో వృద్ధుడికి తక్షణ వైద్యం**

లి విద్యార్థినులు వెంటనే ఆర్.ఎం.ఓ డాక్టర్ గుజ్జల హేమలతకు విషయం వివరించారు. ఆమె తక్షణం స్పందించి క్యాజువాలిటీ మెడికల్ ఆఫీసర్(సీ.ఎం.ఓ) డాక్టర్ కార్తీక్ రెడ్డి, గ్రేడ్-2 నర్సింగ్ సూపరింటెండెంట్ నిర్మలాదేవిని అప్రమత్తం చేశారు. వృద్ధుడిని క్యాజువాలిటీలో అడ్మిట్ చేయించారు. తక్షణ మెరుగైన వైద్య సేవలు ప్రారంభించేలా చొరవ తీసుకున్నారు. అందుకు విద్యార్థినులతో పాటు ఆర్.ఎం.ఓ డాక్టర్ హేమలత, వైద్యులు, నర్సులకు ఆ వృద్ధుడు రెండు చేతులు జోడించి కృతజ్ఞతలు తెలిపారు.

**విద్యార్థినులకు ఆర్.ఎం.ఓ డాక్టర్ హేమలత అభినందనలు**

మానవత్వంతో సకాలంలో వృద్ధుడిని ఆస్పత్రికి ఆటోలో తరలించి ప్రాణాలు కాపాడిన కె.ఎస్.ఆర్ ఇంటర్ విద్యార్థినులు త్రివేణి, కల్యాణి, శిరీష, లల్లీశ్రీని ఆర్.ఎం.ఓ డాక్టర్ గుజ్జల హేమలత అభినందించారు. ఇంత చిన్న వయసులో సామాజిక స్పృహ కలిగి ఓ వృద్ధుడి ప్రాణాలు కాపాడి అందరికీ ఆదర్శంగా నిలిచారని విద్యార్థినులను ప్రశంసించారు.

### శ్రీ సత్యసాయి కలెక్టర్
# శ్యామ్ ప్రసాద్ కు ఘన స్వాగతం

**పుట్టపర్తి – సూర్య వాస్తవం , సెప్టెంబర్ 13:** శ్రీ సత్యసాయి జిల్లా కొత్త కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ శనివారం మధ్యాహ్నం పుట్టపర్తి ప్రశాంతి నిలయాలోని శాంతిభవన్ చేరుకున్నరు. ఆయనకు జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, ఇంఛార్జి డీఆర్వో ఎం.రామ సుబ్బయ్య, ఆర్డీఓలు సువర్ణ, మహేష్, శర్మ, తహసీల్దార్ కళ్యాణ చక్రవర్తి తదితరులు పుష్పగు చ్చాలు అందించి ఘన స్వాగతం పలికారు.



## దళిత రణభేరిని విజయవంతం చేయండి



**సుండుపల్లి - సూర్య వాస్తవం, సెప్టెంబర్ 13:** బిఎస్‌పి రాష్ట్ర అధ్యక్షుడు బందెల గౌతమ్ కుమార్ అధ్యక్షతన ఈనెల 24న ధర్నా చౌక్, గాంధీనగర్, విజయవాడలో జరిగే దళిత రణభేరి కార్యక్రమాని దళిత బిడ్డలు తరలిరావాలని అన్నమయ్య జిల్లా ఇన్చార్జ్ వెంకటరమణ, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు యుగంధర్‌లు కోరారు. శనివారం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుండుపల్లి మండలంలోని పెద్ద మాదిగపల్లి, రాయవరం, పింఛ గ్రామాలలో పర్యటించి దళిత రణభేరి గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. గత వైసిపి పరిపాలనలో, ప్రస్తుత టిడిపి పరిపాలనలో దళితులపై జరుగు తున్న దాడులకు నిరసనగా విజయవాడలో దళిత రణభేరి కార్యక్రమం జరుగుతుందన్నారు. వైసిపి అయినా టిడిపి అయినా మతోన్మాద ముకల మధ్య దళితులకు జరుగుతున్న అన్యాయాలను దాడులను అరికట్టేందుకు ఈ కార్యక్రమం అన్నారు. దేశంలో అత్యధికంగా దళితులపై దాడులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జరుగుతున్నాయన్నారు. పాలకులు, ప్రభుత్వాలు మారుతున్నాయి కానీ, దళితులపై హత్యలు, హత్యాచారులు, దాడులు, దౌర్జన్యాలు, ఆగడం లేదు అన్నారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా కార్యదర్శి పెద్దివిటి నరసింహులు, రాయచోటి అసెంబ్లీ అధ్యక్షుడు నాగేశ్వర్, పట్టణ అధ్యక్షుడు మహేష్, ప్రజలు పాల్గొన్నారు.

## బాధితురాలికి అండగా ప్రిన్సిపాల్, జూనియర్ సివిల్ జడ్జి షేక్ రియాజ్



**విజయవాడ- సూర్య వాస్తవం, సెప్టెంబర్ 13 :** లోక్ అదాలత్‌లో యాక్సిడెంట్ కేసు పరిష్కరించి ముద్దాయి నుండి బాధి తురాలకి 40,000 నష్టపరిహారం ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి షేక్ రియాజ్ ఇప్పించారు. కాలయాపన లేకుండా లోక్ ఆదాలత్ ద్వారా కేసులను త్వర త్వరగా పరిష్కారం చేసుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది బొందలపాటి రామకృష్ణ, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

## డీఈఓ పూల్‌లో ఉన్న లాంగ్వేజ్ పండిట్ల సమస్యలను పరిష్కరించాలి

### - నోబెల్ టీచర్స్ అసోసియేషన్(ఎన్.టి.ఏ) రాష్ట్ర అధ్యక్షులు కొండూరు శ్రీనివాసరాజు

**అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం, సెప్టెంబర్ 13:** రాష్ట్రంలో చాలా సంవత్సరాలుగా డీ.ఈ.ఓ. పూల్ లో పనిచేస్తూ ఉపాధ్యాయ బదిలీలు జరిగిన ప్రతిసారి శాశ్వత స్థానాలు లేక ఇబ్బంది పడుతున్న లాంగ్వేజ్ పండిట్ల సమస్యకు ఒక శాశ్వత పరిష్కారం చూపాలని నోబెల్ టీచర్స్ అసోసియేషన్(ఎన్.టి.ఏ) రాష్ట్ర అధ్యక్షులు కొండూరు శ్రీనివాసరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం రాయచోటి పట్టణంలోని డైట్ పాఠశాలలో వివిధ జిల్లాల నుంచి వచ్చిన లాంగ్వేజ్ పండిట్ లు కలిసిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండిత,పిఈటి వ్యవస్థ రద్దయి సుమారు 6 సంవత్సరాలు పూర్తయినప్పటికీ సరిపడా పాఠశాల సహాయకులు పోస్టులు లేని కారణంగా రాష్ట్రంలో చాలా మంది పండితులు డిఇఓ పూల్ లో పని చేస్తూ పదోన్నతికి నోచుకోక,శాశ్వత స్థానాలు లేక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఈ విషయంలో పండితులు కోర్టును ఆశ్రయించగా గౌరవ కోర్టు కూడా వారికి అనుకూలంగా తీర్పు ఇచ్చిన సందర్భంగా పండితుల ఇబ్బందులు పరిష్కరించే విధంగా ఒక శాశ్వత పరిష్కార దిశగా కృషి చేసి వారి సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. వీలైనంత త్వరలో ప్రభుత్వం తోనూ,పాఠశాల విద్యాశాఖ అధికారులతో మాట్లాడి వెంటనే పరిష్కారం వచ్చేలా కృషి చేస్తామని తనను కలిసిన పండితులకు ఎన్.టి.ఏ రాష్ట్ర అధ్యక్షులు కొండూరు శ్రీనివాసరాజు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పండిత నాయకులు బి.శ్రీనివాస దేవేంద్ర, శ్రీనివాస, కిరణ్‌కుమార్, తిరుపాలు నాయక్, మురళి, శృతి, లావణ్య, రొటీనాయక్, తదితరులు పాల్గొన్నారు.



## దసరా ఉత్సవాల ఏర్పాట్లు

# అత్యున్నత ప్రమాణాలతో ఉండాలి

- భక్తులకు ఏమాత్రం అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు పూర్తిచేయండి
- ఏర్పాట్లలో నిర్లక్ష్యం కనిపిస్తే ఇంజనీరింగ్ అధికారులదే బాధ్యత
- ఆకస్మిక తనిఖీల్లో అధికారులకు దిశానిర్దేశం చేసిన జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ
- నాలుగు గంటల పాటు ఇంద్రకీలాద్రిపై అణువణువూ పరిశీలించిన కలెక్టర్

**విజయవాడ- సూర్య వాస్తవం, సెప్టెంబర్ 13:** దసరా ఉత్సవాల నిర్వహణ ఏర్పాట్లు అత్యున్నత ప్రమాణాలతో ఉండాలని.. భక్తులకు ఏమాత్రం అసౌకర్యం కలిగినా, ఏర్పాట్లలో అలసత్వం కనిపించినా ఇంజనీరింగ్ అధికారులనే బాధ్యత అని, నిరంతర పర్యవేక్షణతో ఏర్పాట్లను పూర్తిచేసి ఉత్సవాలకు సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ కనకదుర్గమ్మ దేవస్థాన అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఈ నెల 22వ తేదీన ప్రారంభం కానున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు చేస్తున్న ఏర్పాట్లను శనివారం ఉదయం జిల్లా కలెక్టర్.. శ్రీ దుర్గామల్లేశ్వరస్వామివార్ల దేవస్థానం అధికారులతో కలిసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఉదయం ఏడు గంటలకు ప్రారంభమైన తనిఖీలు దాదాపు నాలుగు గంటల పాటు కొనసాగాయి. ఇంద్రకీలాద్రి, పరిసర ప్రాంతాల్లో ఉత్సవాలకు చేస్తున్న ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ అణువణువూ పరిశీలించి కార్యనిర్వహణ అధికారి, ఇంజనీరింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు. క్యూలైన్లు, ప్రసాదాల తయారీ, తాగునీటి సరఫరా, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించే ప్రాంతాలు తదితరాలను పరిశీలించారు. తొలుత ఘాట్ రోడ్డు నుంచి ఇంద్రకీలాద్రి రాజగోపురం వరకు ఏర్పాట్లు చేసిన క్యూ లైన్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఐరన్ పైపుల కారణంగా భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకూడదని, పైపులకు వేసే తీగల వల్ల ఇబ్బందిలేకుండా తప్పనిసరిగా క్లాత్ చుట్టాలన్నారు. క్యూలైన్లపై వేసిన షేడ్స్ పైకి ఉండేలా చూసి.. వాటిని సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. మునిసిపల్ కార్పొరేషన్ సహకారంతో భక్తులకు అవసరమైన స్నాన ఘట్టాలు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయడంతో పాటు ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని,





పారి శుద్ధ్యంలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా అవసరమైన సిబ్బందిని నియమిం చుకోవడంతో పాటు నిరంతరం పర్యవేక్షించి పారిశుద్ధ్య నిర్వహణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. భక్తులకు తాగునీరు, మజ్జిగ, పాలు, బిస్కట్లు తదితరాల పంపిణీకి ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఆధ్యాత్మిక వాతావరణంలో, భక్తిభావం ఉప్పొంగేలా.. సంస్కృతీ సంప్రదాయాల ఔన్నత్యం వెల్లివిరిసేలా.. భక్తిభావం ఉప్పొంగేలా దసరా ఉత్సవాల ఏర్పాట్లు ఉండాలని కలెక్టర్ లక్ష్మీశ స్పష్టం చేశారు. ఉత్సవాల్లో సామాన్య భక్తులకు పెద్దపీట వేయడం జరుగుతుందని.. అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించడం జరుగుతుందన్నారు.

భక్తుల ప్రవేశ ద్వారాలు, బయటకు వెళ్లే మార్గాలు ప్రణాళిక ప్రకారం సరైన విధంగా ఉండేలా ఆధ్యాత్మిక శోభతో అలంకరణ ఉండేలా కలెక్టర్ లక్ష్మీశ అధికారులకు సూచనలు చేశారు. కలెక్టర్ వెంట ఆలయ కార్యనిర్వహణ అధికారి శీనా నాయక్, పోలీస్ అధికారులు రామకృష్ణ, దుర్గారావు, ఆలయ ఇంజనీర్లు కేవీఎస్ఆర్ కోటేశ్వరరావు, రాంబాబు, ఇతర ఇంజనీరింగ్ సిబ్బంది ఉన్నారు.

# విజయవాడ ఉత్సవ్‌ను ఎవరు అడ్డుకోలేరు

### - టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గన్నే ప్రసాద్ (అన్నా)

**విజయవాడ- సూర్య వాస్తవం,సెప్టెంబర్ 13 :** ఉత్సవాన్ని అడ్డుకుంటానని దేవినేని అవినాష్ విలేకరుల సమావేశంలో మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని తెలుగు దేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గన్నే ప్రసాద్ (అన్నా) అన్నారు. శనివారం తన కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. అవినాష్ తన వెనక రౌడీ, గంజాయి బ్యాచ్ చూసుకొని రెచ్చిపోయి మాట్లాడు తున్నారని విమర్శించారు.దసరా ఉత్సవాలకి వచ్చే ప్రజల కోసం ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) విజయవాడ ఉత్సవ్ నిర్వహిస్తున్నట్లు స్పష్టం చేశారు. విజయవాడ నగరంలో ఎక్కడ స్థలం దొరకనందున గొల్లపూడి గ్రామంలో ఈ



విజయవాడ ఉత్సవ్ కార్యక్రమం నిర్వహించడానికి ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) తో పాటు ఎమ్మెల్యేలు, ఎన్టీఆర్ జిల్లా కూటమి ప్రజా ప్రతినిధులందరూ సమన్వయం ఏర్పాటు చేశారని వెల్లడించారు.దేవాదాయ శాఖ కింద ఉన్న భూమిలో ప్రస్తుతం కౌలుదారుల సహకారంతో లీజుకి తీసుకొని ఈ విజయవాడ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు స్పష్టం చేశారు. గతంలో ఉన్న విజయవాడ ఎగ్జిబిషన్ సొసైటీ నిర్వాహకుల సహకారంతోనే ఈ విజయవాడ ఉత్సవ్ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. విజయవాడ నగరాన్ని దోచు కోవడం, దాచుకున్నదానికి అంబాసిడర్ అవినాష్, ఓకే సహవాసం కింద ఉన్న పక్షులన్నీ వైయస్ జగన్మోహన్ రెడ్డి గూటికి చేరి నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నారని అవినాష్‌నువిమర్శించారు.దేవినేని అవినాష్ దగ్గర ఉన్న పెద్ద మనుషులు గంజాయి బ్యాచ్ రౌడీ బ్యాచిలర్ దొంగలు జోబు దొంగలు మాత్రమే ఉన్నారని వారిని చూసే పెద్ద మనుషులని అవినాష్ అనుకోవడం జరుగుతుందన్నారు. అతని వెంట ఒక్క విజ్ఞుడైన, నగర ప్రముఖులైన ఉండుంటే గత ఎన్నికల్లో తూర్పు నియోజకవర్గంలో కనీసం గట్టి పోటీ అయిన ఇచ్చేవాడని ఎద్దేవా చేశారు. జగన్మోహన్ రెడ్డి మెప్పుకోసం నువ్వు విజయవాడలో నీచ రాజకీయాలు చేస్తే ప్రజల యొక్క మన్ననలు పొందలేవని అన్నారు. నా బూతో నా భవిష్యత్తు అన్న విధంగా విజయవాడ ఉత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించడానికి కృషి చేస్తున్నట్లు వెల్లడించారు.

# వైయస్ జగన్ చెప్పేవే అన్ని అబద్ధాలే

### - టీడీపీ రాష్ట్ర కార్యదర్శి యలగాల నుకానమ్మ

**విజయవాడ- సూర్య వాస్తవం, సెప్టెంబర్ 13:** తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి, యలగాల నూకానమ్మ యాదవ్ మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డికి అబద్దాలాడడంలో పరీక్ష పెడితే వందకు వంద మార్కులతో ఉత్తీర్ణులు అవుతారని విమర్శించారు.తాను చేసిన అవినీతులు పై అసెంబ్లీ సాక్షిగా ఎమ్మెల్యేలు ప్రశ్నిస్తారని దాని నుండి తప్పించుకోవడానికి 11 సీట్లు వచ్చిన తనకి ప్రతిపక్ష రాదని తెలిసి కూడా అడుగుతున్నారని, తను హయాంలో ఆర్భాటంగా శంకుస్థాపనలకే పరిమితమైన మెడికల్ కాలేజీలను అరకురా వసతులతో కొన్ని



మాత్రమే ప్రారంభించిన జగన్మోహన్ రెడ్డి అన్ని పూర్తిగా అందుబాటులోకి వచ్చినట్టుగా మాట్లాడడం హాస్యాస్పదం అన్నారు.బీసీ వెల్ఫేర్ మహిళ మంత్రి సవితమ్మ వైసీపీ ప్రభుత్వంలో శంకుస్థాపన చేసిన ప్రతి చోటకి వెళ్లి అక్కడ కేవలం పిల్లర్లకు మాత్రమే పరిమితమైన మెడికల్ కాలేజీల పరిస్థితిని వీడియోలతో సహా సోషల్ మీడియా వేదికగా బయటపెడుతున్న ఇంకా జగన్ బుకాయిస్తున్నాడని, మీ హయాంలో పూర్తి చేసాము అని మీరు చెప్పు కుంటున్న మెడికల్ కాలేజీలు వద్దకు స్పెషల్ పోలీస్ ఫోర్స్ లేనిదే బయటికి రాని మీరా మాట్లాడేది అని, జగన్మోహన్‌రెడ్డి తాను ఉండడానికకి వైజాగ్ రుషికొండలో అంత విలాసమైన భవనాన్ని రెండు సంవ త్సరాల్లో పూర్తి చేసి రెండు వేల కోట్లు ఖర్చుపెట్టి ప్రతి జిల్లాలో పార్టీ కార్యాలయలు పూర్తి చేయడంలో పెట్టిన శ్రద్ధ లో సగం మెడికల్ కాలేజీలు పూర్తవడంలో పెట్టిన ఈపాటికి కనీసం 50% అయినా పూర్తి అయ్యేవి అని నూకానమ్మ యాదవ్ ఎద్దేవా చేశారు.

# విద్యార్థుల ప్రతిభకు పట్టం

**పాఠశాల విద్యార్థులారా. ...నెలకు రూ.2వేలు చొప్పున సంవత్సరానికి రూ.24వేలు స్కాలర్ షిప్ అందుకోవాలనుకుంటున్నారా.....**

- 6-11వ తరగతి విద్యార్థులకు అవకాశం
- విద్యార్థి విజ్ఞాన్ మంథన్‌కు దరఖాస్తుల ఆహ్వానం
- ఎంపికైతే స్కాలర్‌షిప్, ప్రఖ్యాత పరిశోధన సంస్థల్లో ఇంటర్న్ షిప్
- సెప్టెంబరు 30 ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు తుది గడువు


విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనలు పెంపొంది ంచేందుకు, విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక ఆలోచనలను ఆవిష్కరణలవైపు ప్రోత్సహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయి. విద్యార్థులు పరిశోధన, ప్రయోగాల్లో రాణించేలా ఏటా కేంద్ర ప్రభుత్వం విద్యార్థి విజ్ఞాన్ మంథన్(వీవీఎం) పేరుతో జాతీయస్థాయిలో ప్రతిభాన్వేషణ పరీక్షను నిర్వహిస్తోంది. కేంద్ర ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక సమాచార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రతిభాన్వేషణ పరీక్షను ఎన్‌సీఈఆర్‌టీ, నేషనల్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ మ్యూజియం, విజ్ఞాన భారతిలు సంయుక్తంగా నిర్వహి స్తున్నాయి. దేశంలో ఆరవ తరగతి నుంచి ఇంట ర్మీడియేట్ ఫస్టియర్ చదువుతున్న వారికి ఈ పరీక్షను నిర్వహిస్తారు. ఇందులో ప్రతిభ కనబర్చిన వారికి భారతదేశ ప్రముఖ పరిశోధన సంస్థల్లో ఇంటర్న్‌షిప్, స్కాలర్‌షిప్‌లు పొందే అవకాశం ఉంటుంది.

**దరఖాస్తులు ఆహ్వానం:**

విద్యార్థి విజ్ఞాన్ మంథన్ ప్రవేశ పరీక్షలో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న విద్యార్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఈ ఏడాది ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం కాగా, సెప్టెంబరు 30వ తేదీలోగా ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ గడువు ముగుస్తుంది. ప్రవేశ పరీక్ష ఆన్‌లైన్ పద్ధతిలో పాఠశాల స్థాయిలో నిర్వహించనున్నారు. పరీక్ష జరిగే రోజు విద్యార్థులకు వారికి అందుబాటులో ఉన్న ఆండ్రాయిడ్, మొబైల్, ల్యాప్‌టాప్, డెస్క్‌టాప్, డిజిటల్ పరికరాలతో ఏదైనా ఒక దాని ద్వారా పరీక్షకు నిర్దేశించిన అప్లికేషన్‌ను ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని వారి ఇంటి నుంచే పరీక్షకు హాజరయ్యే అవకాశముంది.

**జూనియర్, సీనియర్ విభాగాల్లో:**

పోటీ పరీక్షను జూనియర్, సీనియర్ విభాగాల్లో నిర్వహిస్తారు. 6 నుండి 11(ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం)తరగతులకు విడివిడిగా ఈ పరీక్ష ఉంటుంది. ఇందులో తెలుగు, హిందీ, ఇంగ్లీషు తదితర భారతీయ భాషల్లో పరీక్ష ఉంటుంది. విద్యార్థుల ఆసక్తిని బట్టి వారికి నచ్చిన భాషలో పరీక్ష రాయవచ్చు.



- జిల్లా కోఆర్డినేటర్, ఎన్. సౌజన్య, విద్యార్థి విజ్ఞాన్ మంథన్

**100 మార్కులకు పరీక్ష:**

ఈ పరీక్షకు సంబంధించి మాక్ పరీక్షలను 01 సెప్టెంబర్ నుంచి నిర్వహిస్తారు. పాఠశాల స్థాయీ ప్రధాన పరీక్ష అక్టోబరు 28 నుండి 30 తేదీల వరకు ఇందులో ఉత్తీర్ణులైన వారికి లెవిల్ 2 ద్వితీయ పరీక్షను ఆన్లైన్‌లో ప్రోక్టరింగ్ విధానం లో పరిశీలకుల సమక్షంలో 19 నవంబర్ తేదీలో ఉంటుంది. పై రెండు పరీక్షలు ఉదయం 10గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల మధ్య కాలంలో 90 నిమిషాల పాటు(గంటన్నర) పరీక్షను రాయాల్సి ఉంటుంది. పరీక్ష రాసే ప్రతి విద్యార్థి ఒకసారి యాప్‌లో లాగిన్ అవ్వగలుగుతారు. పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధా నంలో ఉంటుంది.లెవిల్ 1 ప్రధాన పరీక్షలో ప్రతీ తరగతులకు సంబంధించిన 100 ప్రశ్నలు ఉంటాయి. ఒక్కో ప్రశ్నకు ఒక్కో మార్కు వంతున 100 మార్కులు కేటాయిస్తారు. సెక్షన్-ఎలో విజ్ఞాన శాస్త్ర రంగంలో భారతీయ మేధావుల కృషి 20 ప్రశ్నలు(20మార్కులు), సత్యేంద్రనాధ్ బోస్ జీవిత చరిత్ర నుంచి 20 ప్రశ్నలు (20 మార్కులు), సెక్షన్-బిలో 6 నుండి 11 తరగతులకు సంబంధించి విద్యార్థులకు గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ సబ్జెక్టుల నుంచి 50 ప్రశ్నలు(50 మార్కులు), లాజిక్, రీజనింగ్ 10 ప్రశ్నలు(10మార్కులు) ఉంటాయి. ఇందు ఉత్తీర్ణులైన వారికి లెవిల్ 2 ద్వితీయ పరీక్ష లో 50 ప్రశ్నలు 100 మార్కులకు ఉంటాయి.

**రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తారిలా:**

పాఠశాల స్థాయి ప్రాథమిక పరీక్ష రాసిన విద్యార్థుల్లో తరగతుల వారీగా ప్రతిభ చూపిన మొదటి 25 మందిని ఎంపిక చేస్తారు. 6-11 తరగతులకు గాను మొత్తం 150 మందిని రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తారు. అందులో ప్రతిభ చూపిన ప్రతి తరగతి నుంచి ముగ్గురు వంతున మొత్తం 18 మందిని జాతీయ స్థాయికి ఎంపిక చేస్తారు. రాష్ట్ర స్థాయి పరీక్ష డిసెంబర్ 21 లేదా 28 లేదా జనవరి 4 తేదీల్లో ఏదో ఒక రోజు పరీక్ష రాయాల్సి ఉంటుంది. రాష్ట్రస్థాయిలో ప్రతి తరగతి నుంచి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు వరుసగా రూ.5వేలు, రూ.3వేలు, రూ.2వేలతో పాటు మెమెంటో, సర్టిఫికేట్ అందజే స్తారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్న ప్రతి విద్యార్థికి మెమెంటో, ప్రశంసాపత్రం అందజేస్తారు.

**జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక ఇలా:**

రాష్ట్రస్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన ప్రతి తరగతి నుంచి మొదటి ఇద్దరు విద్యార్థుల వంతున 12 మందిని ప్రతి రాష్ట్రం నుంచి జాతీయ స్థాయికి ఎంపిక చేస్తారు. అందులో ప్రతి తరగతిలో ప్రతిభ చూపిన మొదటి ముగ్గురు విద్యార్థుల వంతున 18 మందిని జాతీయ స్థాయి విజేతలుగా ప్రకటిస్తారు. జాతీయ స్థాయి విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతిగా వరుసగా రూ.25వేలు, రూ.15వేలు, రూ.10వేలతో పాటు మెమెంటో, ప్రశంసా పత్రంతో పాటు నెలకు 2000 చొప్పున సంవత్సరం పాటు భాస్కర ఉపకార వేతనం అందజేస్తారు. విద్యార్థి విజ్ఞాన్ మంథన్ 2025-26లో జాతీయ, జోనల్ స్థాయి విజేతలుగా నిలిచిన విద్యార్థులకు డీఆర్‌డీవో, ఇస్రో, సీఎస్ఐఆర్, బీఏఆర్‌సీ మొదలైన ప్రఖ్యాత జాతీయ ప్రయోగశాలలు, పరిశోధన సంస్థల్లో 1-3 వారాల పాటు ప్రత్యేక శిక్షణ, ఇంటర్న్‌షిప్ కార్యక్రమం నిర్వహిస్తారు.

**సృజనాత్మకతను వెలికి తీసేందుకు**



విద్యార్థుల్లో దాగి ఉన్న సజనాత్మకతను వెలికి తీసేందుకు విద్యార్థి విజ్ఞాన్ మంథన్ ఒక చక్కని వేదికగా నిలుస్తుందనడంలో ఏ మాత్రం సందేహం లేదు. సైన్స్ పట్ల అభిరుచిని పెంచడం, వారిని శాస్త్రవేత్తలుగా తయారు చేసే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తుంది. ఈ పరీక్ష ను ప్రభుత్వ మరియు ఇతర యాజమాన్య ప్రైవేటు పాఠశాలలు కూడా పాల్గొనవచ్చును

**- జిల్లా సైన్స్ అధికారి, కె.భానుప్రసాద్**

**వ్యక్తిగతంగా లేదా పాఠశాల నుంచి:**




పరీక్ష రాయడానికి ఆసక్తి ఉన్న విద్యార్థులు వ్యక్తిగతంగా లేదా పాఠశాల నుంచి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. విద్యార్థులు డబ్యుడబ్యుడబ్యు. వీవీఎం.ఓఆర్‌జి.ఇన్ వెబ్‌సైట్‌లో లాగిన్ అవ్వవచ్చు. ప్రతి విద్యార్థి ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి. పోటీతత్వాన్ని పెంచుకునేందుకు ఈ పరీక్ష దోహదపడుతుంది.

**- జిల్లా విద్యాశాఖాధికారి, కె.వీ.ఎన్ కుమార్**

**ముఖ్యమైన తేదీలు ఇవే:**

**రిజిస్ట్రేషన్ ప్రారంభం:** 01 జూన్ 2025.
**మాదిరి పరీక్షలు(మాక్ టెస్ట్):** ఈ ఏడాది సెప్టెంబర్ 01 నుంచి
**పరీక్ష తేదీ: లెవిల్ 1 :** అక్టోబరు 28 నుంచి అక్టోబర్ 30 వరకు
**లెవిల్ 2:** నవంబర్ 7
**పరీక్ష సమయం:** ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల మధ్యలో 90 నిమిషాలు మాత్రమే. (ఒకసారి మాత్రమే పరీక్షకు హాజరు కావాలి)
**పరీక్షల ఫలితాల వెల్లడి:** నవంబరు 27
**రాష్ట్ర స్థాయి క్యాంపు:** డిసెంబర్ 21 లేదా డిసెంబరు 28 లేదా జనవరి 4 (ఏదైనా ఒక రోజు).
**జాతీయ క్యాంపు:** 2026 మే నెలలో

# కొత్త జిల్లాలపై ఫైనల్ కసరత్తు



**కాకినాడ- సూర్య వాస్తవం**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కొత్త జిల్లాల ఏర్పాటు, ఉన్న జిల్లాల సరిహద్దుల మార్పు, మండలాలు, గ్రామాల సర్దుబాట్లు, పేర్ల మార్పు వంటి అంశాలపై అధ్యయనం చేయడానికి ఏడుగురు మంత్రులతో కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఈ సబ్ కమిటీ కసరత్తు చేస్తోంది. గత వైసీపీ ప్రభుత్వం చేసిన జిల్లా విభజనలో ఏర్పడిన గందరగోళాన్ని సరిచేయడం, ప్రజల సౌకర్యాన్ని పెంచడం ప్రధాన లక్ష్యాలుగా మార్పు, చేర్పులపై ఆలోచనలు చేస్తున్నారు. ప్రజా అభిప్రాయాలను సేకరించి, శాస్త్రీయంగా పునర్వ్యవస్థీకరణ చేయాలని కమిటీ పనిచేస్తోంది.కానీ మొత్తం ఏడుగురు మంత్రులతో ఏర్పాటు చేశారు. కలెక్టర్లు, ప్రజల నుంచి సూచనలు సేకరించడంలో కమిటీ పాల్గొంటుంది. గత ప్రభుత్వం జిల్లాలు ఏర్పాటు చేసినప్పుడు ప్రజాభిప్రాయాలను పట్టించుకో?కండా ..అసమంజసమైన సరిహద్దులతో జిల్లాలను ఏర్పాటు చేశారన్న అభిప్రాయం ఉంది. రంపచోడవరం నుంచి జిల్లా కేంద్రానికి 187 కి.మీ. దూరం ఉంది. దీని వల్ల గందరగోళం ఏర్పడింది. ఇప్పుడు ఇవి సరిచేయడానికి కొత్త జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. అలాగే సరిహద్దులు , పేర్ల మార్పుపైనా కసరత్తులు చేస్తున్నారు. జిల్లాలు, మండలాలు, గ్రామాల సరిహద్దులు మార్చడం, పేర్లు మార్చడం. ప్రజల నుంచి వచ్చిన డిమాండ్‌ల ఆధారంగా సాధ్యాసాధ్యాలను పరిశీలించను న్నారు. ఇతర జిల్లాల్లో సరిహద్దులు మార్చే ప్రతిపాదనలు ఉన్నాయి. అద్దంకి (బాపట్ల జిల్లా), కందుకూరు (నెల్లూరు జిల్లా) ఒంగోలు, కొండపి, సంతనుతలపాడు (మొత్తం 5 నియోజకవర్గాలు)తో ప్రకాశం జిల్లా, కృష్ణ జిల్లా నుంచి గన్నవరం, పెనమలూరు ఔఖీ జిల్లాలో కలపడం (విజయవాడ ఈస్ట్, వెస్ట్, సెంట్రల్, తిరువురు, మ్యలవరం ? మొత్తం 7). విజయనగరం జిల్లా నుంచి ఎస్.కోటా విశాఖపట్నంలో చేర్చడం, తూర్పు గోదావరి జిల్లాలో మండపేట చేర్చడం, కాకినాడ జిల్లాలో రామచంద్రాపురం చేర్చడం. తిరుపతి జిల్లాలో రైల్వే కోడూరు చేర్చడం వంటి ప్రతిపాదనలపై చర్చించే అవకాశం ఉంది. కలెక్టర్ల ద్వారా సూచనలు సేకరణ, ప్రజా అభిప్రాయాలు పరిగణనలోకి తీసుకుంటారు. మార్కాపురం కొత్త జిల్లాను గిద్దలూరు, కనిగిరి, మార్కాపురం, యర్రగొండపాలెం, దర్శి నియోజకవర్గాలు చేర్చి ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన ఉంది. గుంటూరు జిల్లా నుంచి మంగళగిరి, తాడికొండ నియోజకవర్గాల్లోని 29 గ్రామాలు, పెదకూరపాడు, నందిగామ, జగ్గయ్యపేట వంటి 5 నియోజకవర్గాలతో అమరావతి జిల్లా ఏర్పాటు, రంపచోడవరం డివిజన్, చింతూరు డివిజన్ నుంచి 4 మండలాలు కలిపి రంపచోడవరం జిల్లాలను ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనలపై చర్చలు జరుగుతున్నాయి. కొన్ని జిల్లాల సరిహద్దులు మార్చే ప్రక్రియ ఉది. కమిటీ ఈ నెలలోనే సమావేశాలు నిర్వహిస్తూ, అసెంబ్లీ సమావేశాలకు ముందు నివేదిక సమర్పించనుంది. మొత్తం ప్రక్రియ 2025 డిసెంబర్ 31కి పూర్తి చేయాల్సి ఉటుది. 2026 జనవరి 1 నుంచి 2027 మార్చి 31 వరకు సెన్సస్ కారణంగా జిల్లా మార్పులు చేయలేరని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.

# దళిత రణభేరి పోస్టర్లు విడుదల



**గుత్తి - సూర్య వాస్తవం, సెప్టెంబర్ 13:** గుత్తి పట్టణంలోని సత్రామిట్ట దగ్గర వున్నా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం నందు బీఎస్పీ పార్టీ ఆధ్వర్యంలో దళిత రణభేరి పోస్టర్లు విడుదల చేశారు. ముందుగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి ఈనెల 24వ తేదీ విజయవాడలో జరగ బోయే దళిత రణభేరి కార్య క్రమానికి ఎస్సీ ఎస్టీ మైనార్టీ ప్రజలు రావాలని బీఎస్పీ పార్టీ గుంతకల్ నియోజక వర్గం ఇంచార్జ్ విజయ్ చెప్ప డం జరిగినది ఈ కార్యక్రమం లో గుత్తి బి ఎస్ పి పార్టీ ఇన్చార్జ్ కొండయ్య, బండల రామాంజనేయులు,రమేష్ సం జీవ, ఓబులేష్, విజయ్,రంగ స్వామి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

**- ట్రాఫిక్ సీఐ అబ్దుల్ గౌస్**
**- ట్రాఫిక్ నిబంధనలపై డ్రైవర్లకు అవగాహన సదస్సు**



**ఆదోని - సూర్య వాస్తవం, సెప్టెంబర్ 13:** ఆదోని ట్రాఫిక్ సిఐ అబ్దుల్ గౌస్ ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌లో శనివారం రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ట్రాఫిక్ సిఐ అబ్దుల్ గౌస్ మీడియాతో మాట్లాడుతూ కర్నూలు రేంజ్ డిఐజి కోయ ప్రవీణ్, కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు డిఎస్పీ హేమలత ఆధ్వర్యంలో డ్రైవర్లకు ట్రాఫిక్ రూల్స్ పై అవగాహన సదస్సు నిర్వహించడం జరిగిందన్నారు. వాహనాలను నడిపే ఆటో డ్రైవర్లు మద్యం సేవించి, సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదన్నారు. ప్రతి వాహనానికి రికార్డులు, ఇన్సూరెన్స్, డ్రైవర్స్ యూనిఫారం ధరించాలని, ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదని ఈరోజునే డ్రైవర్లు పాటించాలని డ్రైవర్లకు ట్రాఫిక్ సిఐ అబ్దుల్ గౌస్ సూచించారు.

# వైసీపీ రాష్ట్ర కార్యదర్శిగా జె.చక్రపాణి రెడ్డి నియామకం



**శాంతిపురం - సూర్య వాస్తవం, సెప్టెంబర్ 13 :** కుప్పం నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేత, మాజీ రెస్కో అధ్యక్షులు, శాంతిపురం మండలం దండి కుప్పం గ్రామానికి చెందిన జె.చక్రపాణి రెడ్డిని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధిష్టానం రాష్ట్ర కార్యదర్శిగా నియమించింది. ఈ మేరకు ఎమ్మెల్సీ కె ఆర్ జె భరత్ కార్యాలయం నుంచి ఓ ప్రకటన వెలువడింది. పార్టీ ఆవిర్భావం నుంచి విశిష్ట సేవలు అందించిన జె చక్రపాణి రెడ్డిని రాష్ట్ర కార్యదర్శిగా నియమించాలంటూ అధిష్టానానికి సిఫార్సు చేసినట్లు ఆ ప్రకటనలో ఎమ్మెల్సీ కేఆర్జే భరత్ పేర్కొన్నారు. కాగా తనను వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా నియమించడంపై చక్రపాణి రెడ్డి తన సంతోషాన్ని వ్యక్తం చేస్తూ సాధారణ కార్యకర్తగా ఉన్న ప్రతి వ్యక్తికి పార్టీలో గుర్తింపు లభిస్తుంది అనడానికి ఇదే నిదర్శనమని మీడియాకు తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం కుప్పం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీ కె ఆర్ జె భరత్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. తనకు అప్పగించిన ఈ గురుతర బాధ్యతను మనస్ఫూర్తిగా నిర్వహిస్తానని ఇందుకు సహకరించిన పార్టీ పెద్దలకు అధిష్టానానికి కార్యకర్తలకు, నేతలకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నేతలు శాంతిపురం మండల వైసీపీ అధ్యక్షుడు బుల్లెట్ దండ పాణి, మహిళా నేత అదెమ్మ, సుబ్రమణ్యం, శంకర్ రెడ్డి, మురుగేష్, తదితరులు పాల్గొన్నారు.


# టీటీడీ ఎస్వీ అన్నప్రసాదం ట్రస్ట్‌కు రూ.44 లక్షల విరాళం



**తిరుమల - సూర్య వాస్తవం, సెప్టెంబర్ 13 :** నవంబర్ 9న తన పుట్టినరోజు సందర్భంగా ఒక్కరోజు అన్నప్రసాదం వితరణకు అయ్యే ఖర్చు రూ.44 లక్షలు విరాళమిచ్చిన దాత తమిళనాడు రాష్ట్ర మంత్రి కెఎన్ నెహ్రూ క్యాంప్ కార్యాలయంలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడుని కలిసి విరాళం డిడిని దాత తరపు ప్రతినిధి సురేష్ అందజేశారు.

## ఎపిలో మొట్టమొదటిసారి

# ఇళయరాజా సంగీత విభావరి




**హైదరాబాద్ బ్యూరో :** భారతదేశపు సంగీత దర్శకుడు, పాటల రచయిత, గాయకులు ఇళయరాజా సంగీత విభావరి (లైవ్ కన్సర్ట్) పెద్ద ఎత్తున మొదటిసారి ఆంధ్రప్రదేశ్ లో జరగనుంది. విజయవాడ ఎంజి రోడ్ లోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నవంబర్ 8వ తేదీన శనివారం నాడు కనీవినీ ఎరుగని రీతిలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. విజయవాడలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన ట్రెండ్ సెట్టర్స్ లైవ్ సుధాకర్ ఈ లైవ్ కన్సర్ట్ ను నిర్వహిస్తున్నారు. ఈ సంగీత కచ్చేరికి సంబంధించిన పోస్టర్ ను ఇళయరాజా తో పాటు, ఏపీ ఇండిస్ట్రీస్ మినిస్టర్ టీజీ భరత్ విడుదల చేశారు. ఈవెంట్ కు సంబంధించిన టికెట్లను ఇప్పటికే బుక్ మై షో లో పొందుపరచగా మంచి రెస్పాన్స్ దక్కుతోంది. అత్యంత వేగంగా టికెట్లు అమ్ముడవుతున్నాయి. ఇంకా లిమిటెడ్ టికెట్స్ మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఇప్పటివరకు కనీవినీ ఎరుగని రీతిలో ఈ సంగీత విభావరి కార్యక్రమం కోసం గట్టి భద్రత, సకల సౌకర్యాలతో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లుగా నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ట్రెండ్ సెట్టర్స్ సుధాకర్ మాట్లాడుతూ ... ''సినీ సంగీతానికి జీవనాడిగా ఉన్న ఇళయరాజా గారితో కలిసి ఈ సంగీత విభావరి కార్యక్రమాన్ని నిర్వహించడం చాలా సంతోషంగా ఉంది. ఇళయరాజా గారు మొదటిసారి ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహిస్తున్న లైవ్ కన్సర్ట్ కావడంతో విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో భారీ ఎత్తున సన్నాహాలు చేస్తున్నాం. ఈ ఈవెంట్ కు సంబంధించిన టిక్కెట్లను బుక్ మై షో యాప్ ద్వారా బుక్ చేసుకోవచ్చు. 40 మంది సభ్యుల బృందంతో ఇళయరాజా గారు ఈ లైవ్ కన్సర్ట్ కు హాజరవుతున్నారు. ఏపీలో ఇలాంటి మ్యూజికల్ కన్సర్ట్ ను ఇంత లార్జ్ స్కేల్ లో నిర్వహించడం ఇదే మొదటిసారి '' అని చెప్పారు.

## మిరాయ్‌లో ప్రభాస్

# వాయిస్ ఓవర్ వెనుక ట్విస్ట్?



టాలీవుడ్ లేటెస్ట్ హిట్ మిరాయ్‌లో అదనపు ఆకర్షణలు చాలానే ఉన్నాయి. ఈ సినిమాలో రానా దగ్గుబాటి చివర్లో ఒక క్యామియోలో కనిపించాడు. దానికి మంచి స్పందనే వచ్చింది. నిధి అగర్వాల్ స్పెషల్ సాంగ్ చేయగా.. అది సినిమాలో పెట్టలేదు. ఇక సినిమా ఆరంభంలో ప్రభాస్‌తో వాయిస్ ఇప్పించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.మన పురాణాలు, ఇతిహాసాల గొప్పదనాన్ని చెబుతూ.. కథా నేపథ్యాన్ని వివరించిన తీరు ప్రభాస్ అభిమానులనే కాక సామాన్య ప్రేక్షకులను కూడా ఆకట్టుకుంది. విశేషం ఏంటంటే.. ప్రభాస్ తన సొంత సినిమాలకు మించి దీనికి డబ్బింగ్ బాగా చెప్పాడనే ఫీడ్ బ్యాక్ వచ్చింది. మామూలుగా ప్రభాస్ డైలాగ్ డెలివరీలో వేగం ఉండదు. కొంచెం పట్టి పట్టి డైలాగ్స్ చెబుతున్నట్లుంటుంది. వాయిస్ కొంచెం రఫ్‌గా కూడా ఉంటుంది. కానీ మిరాయ్ వాయిస్ ఓవర్ మాత్రం కొంచెం భిన్నంగా సాగింది. మాట కొంచెం స్పీడుగా ఉంది. మృదుత్వం కూడా పెరిగింది. వాయిస్ ఓవర్ విన్న వాళ్లు ప్రభాస్‌లో వచ్చిన ఈ మార్పుకు ఆశ్చర్యపోయి ఉంటారనడంలో సందేహం లేదు. కానీ ఈ మార్పు వెనుక పెద్ద ట్విస్ట్ ఉందని సమాచారం.మిరాయ్ వాయిస్ ఓవర్లో వినిపించింది ప్రభాస్ ఒరిజినల్ గొంతు కాదట. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ సాయంతో ప్రభాస్ వాయిస్‌ను రీక్రియేట్ చేశారని ఒకప్రచారం జరుగుతోంది. ప్రభాస్ అనుమతితోనే ఇలా చేశారని.. చాలా జాగ్రత్తగా, శ్రద్ధగా ఈ వర్క్ చేయడంతో మంచి ఔట్ పుట్ వచ్చిందని అంటున్నారు. ఈ విషయాన్ని అధికారికంగా మాత్రం బయట పెట్టట్లేదు.మిరాయ్ సక్సెస్ మీట్లో కూడా అందరూ ప్రభాస్ వాయిస్ ఓవర్ ఇచ్చినందుకు థ్యాంక్స్ చెప్పడం గమనార్హం. కానీ జాగ్రత్తగా గమనిస్తే ఏఐతోనే ప్రభాస్ వాయిస్‌ను క్రియేట్ చేశారన్నది అర్థమైపోతుంది. మరి దీని గురించి పోస్ట్ రిలీజ్ ప్రమోషన్లు, ఇంటర్వ్యూల్లో చిత్ర బృందం ఓపెన్ అవుతుందేమో చూడాలి.



# పైచేయి ఎవరిదో..?

**- నేడు భారత్, పాకిస్తాన్ జట్ల మధ్య కీలక పోరు**
**రాత్రి 8.00గం౦ఎల నుంచి ఆసియా కప్ క్రికెట్ టోర్నీ**



**దుబాయ్:** క్రీడాభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న భారత్-పాకిస్తాన్ జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్ మరికొద్ది గంటల్లో ప్రారంభం కానుంది. ఆసియాకప్ క్రికెట్ టోర్నీలోనే హై ఓల్టేజ్ క్రికెట్ మ్యాచ్ ఇది. సూపర్-4లో చేరుకోవాలంటే ఇరుజట్లకు గెలుపు తప్పనిసరి. గ్రూప్-ఎలో భాగంగా తొలి లీగ్ మ్యాచ్‌లో భారతజట్టు ఆతిథ్య యుఎఇపై, పాకిస్తాన్ జట్టు ఒమన్‌పై ఘన విజయం సాధించాయి. ఈ క్రమంలో భారత్-పాకిస్తాన్ జట్ల మధ్య ఆదివారం ఉత్కంఠ పోరు జరగనుంది. టీమిండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ స్పిన్నర్లపైనే భారం మోపాడు. రెగ్యులర్ పేసర్ బుమ్రా మినహా.. మరో పేసర్‌ను టి20ల్లో ఎంపిక చేసే అవకాశం లేదు. దీంతో వరుణ్ చక్రవర్తి, కుల్దీప్ యాదవ్‌లపైనే ఆశలు ఉన్నాయి. వరుణ్ చక్రవర్తి గత ఛాంపియన్స్ ట్రోఫీలో టీమిండియా విజయంలో కీలక పాత్ర పోషించాడు. స్పిన్ ఆల్‌రౌండర్‌గా అక్షర్ పటేల్ పేస్ ఆల్‌రౌండర్‌గా హార్దిక్ పాండ్యా ఉండనే ఉన్నారు. 'చైనామన్' బౌలర్ కుల్‌దీప్ యాదవ్ గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిందే. ఆరు నెలల తర్వాత అంతర్జాతీయ క్రికెట్‌లో ఆడే అవకాశం రావడంతో తొలి మ్యాచ్‌లో యుఎఇపై అదరగొట్టాడు. ఆసియా కప్ తొలి మ్యాచ్‌లోనే యూఏఈపై నాలుగు వికెట్ల ప్రదర్శన చేశాడు. వైవిధ్యమైన అతడి బౌలింగ్ ముందు పసికూన నిలవలేకపోయింది. అయితే, చాన్నాళ్లు బెంచ్‌కే పరిమితమైనా తనలోని సత్తా తగ్గలేదని నిరూపించాడు. స్టంప్స్ లక్ష్యంగా అతడి బౌలింగ్‌ను తట్టుకోవడం పాక్ యువ బ్యాటింగ్ విభాగానికి కష్టమే. తన 'స్పిన్' ఎటాక్‌తో విరుచుకుపడతాడని అభిమానులు ఆశగా ఎదురుచూస్తున్నారు. జస్‌ప్రీత్ బుమ్రాను పాక్ బ్యాటర్లు ఎలా ఎదుర్కొంటారో చూడాలి. టీమిండియాపై చెలరేగిపోయే షహీన్ అఫ్రిదిపై మన బ్యాటర్లు ఆధిపత్యం ప్రదర్శిస్తే మనకు కష్టమే. బ్యాటింగ్‌లో అభిషేక్-గిల్ జోడీ.. బౌలింగ్‌లో కుల్దీప్-వరుణ్ చక్రవర్తి జోడీ ప్రధాన ఆకర్షణ అనడంలో సందేహం లేదు.మరోవైపు పాకిస్తాన్ జట్టుకు మహ్మద్ నవాజ్ రూపంలో అత్యంత ప్రమాదకార స్పిన్నర్ ఉన్నాడు. అతడికి తోడుగా అబ్రార్ అహ్మద్ కూడా కీలకమే. ఇక సుఫియాన్ ముకీమ్, సయామ్ అయుబ్ కూడా పార్ట్ స్పిన్‌తో వికెట్లు తీసే బౌలర్లు. అయితే, భారత బ్యాటర్లు వీరిని ఎలా ఎదుర్కొంటారనేది ఆసక్తికరం. సీనియర్లు రోహిత్, విరాట్ కోహ్లీ, కేఎల్ రాహుల్ వంటి ఆటగాళ్లు లేకుండా తొలిసారి మినీ టోర్నీలో టీమ్‌ఇండియా ఆడుతోంది. స్పిన్‌ను కాచుకొని క్రీజ్‌లో నిలదొక్కుకుంటే దుబాయ్‌లో పరుగులు చేయడం పెద్ద కష్టమేం కాదు.

**జట్లు(అంచనా)..**

ఇండియా: సూర్యకుమార్(కెప్టెన్), శుభ్‌మన్, అభిషేక్ శర్మ, తిలక్ వర్మ, దూబే, హార్దిక్, సంజు(వికెట్ కీపర్), అక్షర్, కుల్దీప్, బుమ్రా, వరుణ్ చక్రవర్తి.

**పాకిస్తాన్:** అఘా సల్మాన్(కెప్టెన్), హ్యారిస్(వికెట్ కీపర్), ఆయుబ్, ఫర్హాన్, నవాజ్, ఫహీమ్ అష్రాఫ్, షాహిన్ షా అఫ్రిది, రవూఫ్, అబ్రార్ అహ్మద్, హసన్ అలీ, షోరిఫుల్ ముఖీమ్.

# ఫైనల్‌కు భారత మహిళల జట్టు




## - చివరి మ్యాచ్‌లో జపాన్‌తో డ్రా-నేడు చైనాతో ఢీ

**హాంగ్జౌ(చైనా):** ఆసియాకప్ మహిళల హాకీ ఫైనల్లోకి భారత జట్టు దూసుకెళ్లింది. సూపర్-4లో భాగంగా శనివారం జరిగిన చివరి మ్యాచ్‌లో భారతజట్టు జపాన్‌తో డ్రాగా ముగించింది. మ్యాచ్ ప్రారంభమైన 7వ ని.లోనే బ్యూటీ గోల్ కొట్టి భారత్‌ను 1-0 ఆధిక్యతలో నిలిపింది. ఆ తర్వాత రెండు, మూడు క్వార్టర్‌లలో ఇరుజట్లు గోల్స్ చేయడంలో విఫలమయ్యాయి. నాల్గో క్వార్టర్ చివరి వరకు ఏ జట్టూ గోల్ చేయలేదు. మరో రెండు నిమిషాల్లో మ్యాచ్ ముగుస్తుందనగా.. జపాన్ తరఫున కొబయకవల(58వ ని.) గోల్ చేశాడు. దీంతో 1-1గోల్స్‌తో సమమైంది. ఆదివారం జరిగే ఫైనల్లో భారత మహిళల జట్టు పటిష్ట చైనాతో తలపడనుంది. లీగ్ దశలో చైనా చేతిలో భారతజట్టు 1-4గోల్స్ తేడాతో ఓటమిపాలైన సంగతి తెలిసిందే. దీంతో సూపర్-4లో జపాన్‌లతో మ్యాచ్‌లను డ్రా చేసుకున్న భారత్.. కొరియాపై గెలిచి ఆతిథ్య చైనా చేతిలో ఓటమిపాలైనప్పటికీ 4పాయింట్లతో 2వ స్థానంలో నిలిచి ఫైనల్‌కు అర్హత సాధించింది. ఇక చివరి మ్యాచ్‌లో చైనా 1-0తో ద.కొరియాను చిత్తుచేసి పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచి ఫైనల్‌కు చేరుకుంది. ఇక 5నుంచి 8స్థానాలకు లీగ్ మ్యాచ్‌లు కూడా ముగిసాయి. 5, 6 స్థానాలకు మలేషియా, సింగపూర్.. 7, 8 స్థానాలకు థారులాండ్, చైనీస్ తైపీ జట్లు తలపడనున్నాయి.

**సూపర్-4 పాయింట్ల పట్టిక**

| వ.స. | జట్టు | ఆ | గె | ఓ | డ్రా | చే.గో. | ఇ.గో. | గో.అం. | పా |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | చైనా | 3 | 3 | 0 | 0 | 7 | 1 | o6 | 9 |
| 2 | భారత్ | 3 | 1 | 1 | 1 | 6 | 7 | -1 | 4 |
| 3 | జపాన్ | 3 | 0 | 2 | 1 | 2 | 4 | -2 | 2 |

## ఆంధ్రప్రదేశ్‌కు గర్వకారణంగా నిలిచిన

# చిన్నారుల ఈత సాహసం

**- దేవినేని ఉమామహేశ్వర రావు**

**విజయవాడ- సూర్య వాస్తవం, సెప్టెంబర్ 13 :** ఆంధ్రప్రదేశ్ పోలీస్ విభాగానికి చెందిన ప్రముఖ స్విమ్మర్ ఎం. తులసీ చైతన్య తన శిష్యులు, వారి తల్లిదండ్రులతో కలిసి గొల్లపూడిలోని కార్యాలయంలో టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వర రావును మర్యాదపూర్వకంగా కలిశారు.తులసీ చైతన్య శిక్షణలో ఉన్న చిన్నారులు తిన్నలూరి ఆర్య నైకే (5 ఏళ్లు), మోతుకూరి తమోగ్న (5 ఏళ్లు), మన్నే నాగ సాయి ఆశ్రిత (6 ఏళ్లు) జర్మనీ నుండి ఆస్ట్రియా వరకు 6.3 కిలోమీటర్లు ఈదుతూ ప్రపంచ రికార్డు సృష్టించారు. ఐదేళ్ల వయస్సులో బోడెన్సీ సరస్సు దాటిన అతి పిన్న వయస్కులైన బాలికలుగా గుర్తింపు పొందారు. ఈ ఘనతకు జర్మనీలోని బోడెన్సీక్వెర్‌ంగ్ అసోసియేషన్ అధికారికంగా గుర్తింపు ఇచ్చింది. ఈ విషయాన్ని ఎన్టీఆర్ మోడరన్ పెంటతలాన్ అసోసియేషన్ సెక్రటరీ డింపుల్ కృష్ణ ప్రకటించారు.

**రాష్ట్రపతి అవార్డు గ్రహీత తులసీ చైతన్య శిక్షణలోనే విజయం:** తులసీ చైతన్య 2022లో రాష్ట్రపతి చేతులమీదుగా ప్రతిష్ఠాత్మక టెంజింగ్ నార్గే నేషనల్ అడ్వెంచర్ అవార్డును అందు కున్నారు. ఆమె శిక్షణలోని ఈ చిన్నారులు ప్రతిభతో, సాహసంతో అంతర్జాతీయ స్థాయిలో వెలుగొందడం రాష్ట్రానికి, దేశానికి గర్వ కారణమని విశేషంగా పేర్కొన్నారు.



**ఉమా హృదయపూర్వక అభినందనలు**

ఈ అంతర్జాతీయ సవాల్ స్వీకరించే ముందు కూడా చిన్నారులు తనను కలిసి వెళ్లారని, ఇప్పుడు విజయవంతంగా పూర్తి చేసి రావడం సంతోషకరమని దేవినేని ఉమా అన్నారు. చిన్నారులు రెండు ఏళ్ల వయసు లోనే గొల్లపూడిలో కృష్ణానది నుండి ఈస్ట్ బైపాస్ వరకు ఈత నేర్చుకున్న సందర్భాన్ని కూడా ఆయన గుర్తు చేసుకున్నారు. వారి కృషి, అంకితభావమే ఈ రోజు ప్రపంచ రికార్డు సాధనకు దారితీసిందని ఉమా అభినం దనలు తెలిపారు.రాష్ట్రం, దేశానికి మరిన్ని ఉన్నత శిఖ రాలను అందించాలని ఆకాంక్షిస్తూ ఈ చిన్నారుల బృందానికి ఆయన ప్రత్యేక అభినందనలు తెలిపారు. చిన్నారుల సాహసయాత్ర రాష్ట్ర యువతకు ప్రేరణగా నిలు స్తుందని, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆశాభావం వ్యక్తం చేశారు.



## జిల్లా అభివృద్ధికి ఆయా శాఖల

# అధికారులు సహకారం అందించాలి

**- అనంతపురం జిల్లా కలెక్టర్ ఆనంద్**

**అనంతపురం కలెక్టరేట్ - సూర్య వాస్తవం, సెప్టెంబర్ 13 :** జిల్లా అభివృద్ధికి ఆయా శాఖల అధికారులు సహకారం అం దించాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఆదేశించారు. శనివారం అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో వివిధ శాఖల జిల్లా అధికారులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కలెక్టర్ల కాన్ఫరెన్స్ నేపథ్యంలో ఆయా శాఖల పరిధిలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సిన ఏమైనా సమస్యలు ఉంటే తెలియ జేయా లన్నారు. గత కలెక్టర్ల కాన్ఫరెన్స్ లో ఆయా శాఖల పరిధిలో వచ్చిన సమస్యలకు



సంబంధించిన వివరాలను తెలపాలన్నారు. రాష్ట్రస్థాయిలో రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళ్తే తప్ప పరిష్కారం కాదు అనే సమస్యలను తెలపాలని సూచించారు. జిల్లాలో యూరియాకు సంబంధించి రోజు ఎంత డిమాండ్ ఉంది, ప్రస్తుతం సాగు జరుగుతోందా, రోజు ఎంత అవసర మవుతుంది, రైతు సేవ కేంద్రాలు పిఎసిఎస్ సొసైటీల ద్వారా యూరియాను అందిస్తున్నారా, వ్యవసాయ, ఉద్యాన శాఖల పరిధిలో సచివాలయాలలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్లు ఎంతమంది ఉన్నారు, తదితర వివ రాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో సత్యసాయి త్రాగునీటి పథకంకు సంబంధించిన సమస్యలు ఏమున్నాయి, ప్రస్తుతం అమలు జరుగుతోందా అంటూ అడిగి తెలుసుకున్నారు. ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, అనంతరం మధ్యాహ్నం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయా శాఖల పరిధిలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, పథకాల గురించి జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులు, ఎంపీడీవోలు, తహసిల్దార్లు, తదితరులతో సమీక్ష నిర్వహించడం జరుగుతుందని, ఇందుకు సంబంధించిన నోట్స్ శనివారంలోపు తయా రుచేసి ఆయా శాఖల అధికారులు అందించాలన్నారు.

## ప్రభుత్వ సేవలను

# పారదర్శకంగా ముందుకు తీసుకెళ్తాం

**- జిల్లా కలెక్టర్‌గా ఏ.శ్యాం ప్రసాద్ పదవీ బాధ్యతలు స్వీకరణ**

**శ్రీ సత్య సాయి జిల్లా బ్యూరో- సూర్య వాస్తవం, సెప్టెంబర్ 13:** ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజల సహకారంతో ప్రభుత్వ సేవలను పారదర్శకంగా ముందుకు తీసుకెళ్లి జిల్లాను అన్ని విధాల అభివృద్ధి చేస్తానని జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం పుట్టపర్తి కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో నూతనంగా జిల్లా కలెక్టర్‌గా పదవి బాధ్యతలు స్వీక రించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ను పలువురు అధికారులు, సిబ్బంది పరిచయం చేసుకొని శు భాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా విలేకరులతో జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ మాట్లాడుతూ తాను పార్వతీపురం మన్యం జిల్లా నుండి కలెక్టర్ గా బదిలీ అయి శ్రీ సత్య సాయి జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించానన్నారు. సత్యసాయి జిల్లాతో తనకు అవినాభావ సంబంధం ఉందని, తన కుమార్తె విద్యాభ్యాసం కూడా ఇదే ప్రాంతంలో జరిగిందన్నారు. శ్రీసత్యసాయి జిల్లాలో రాబోయే వంద సంవత్సరాల శ్రీసత్య సాయిబాబా జన్మదినోత్సవ వేడుకలను కూడా విజయవంతంగా నిర్వహించేందుకు అందరూ సహకారం అందించాలని కలెక్టర్ కోరారు. కర్ణాటక రాష్ట్రానికి సమీపంలో ఉండి వెనుకబడిన శ్రీసత్యసాయి జిల్లాను అన్ని విధాల ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానన్నారు. వ్యవసాయ ఆధారిత జిల్లా అయిన సత్య



సాయి జిల్లాలో పారిశ్రామిక రంగానికి కూడా ఎక్కువ అవకాశాలు ఉన్నాయన్నారు. జిల్లాలో పరిశుభ్రత, నీటి సరఫరా, విద్యుత్, జల సంరక్షణ, ఆరోగ్యము విద్య తదితర ప్రధానమైన అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తానని తెలియజేశారు.ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను మరింత సమర్థంగా అమలు చేసి ప్రజలకు చేరవేయడమే తన ముఖ్య లక్ష్యంగా ఉంటుందని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలు, అభిప్రాయాలకు ప్రాధా న్యత ఇస్తూ పారదర్శకంగా, బాధ్యతాయుతంగా పనిచేస్తానని కలెక్టర్ తెలిపారు. ప్రతి పౌరుడికి అవసరమైన సేవలను త్వరితగతిన అందిం చేందుకు కృషి చేస్తామని, సేవాభావంతో, పారదర్శకంగా పని చేస్తానని కలెక్టర్ స్పష్టం చేశారు. పదవి బాధ్యతలు స్వీకరించిన అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులను, సిబ్బందిని పరిచయం చేసుకుని, పరిపాలనను సమర్థంగా నడిపేందుకు అందరూ సహకరించాలని సూచించారు.ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, ఇంఛార్జి డిఆర్ఓ రామసుబ్బయ్య, ఆర్డీవోలు సువర్ణ, మహేష్, వివిఎస్ శర్మ, ఆనంద్ కుమార్, జిల్లా అధికారులు ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ఏఐఎస్ఏ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా

# తుమ్మల లవకుమార్ ఎంపిక



**అన్నమయ్య బ్యూరో- సూర్య వాస్తవం, సెప్టెంబర్ 13:** విజయవాడ కేంద్రంగా ఈనెల 11,12 తేదీలలో జరిగిన ఆల్ ఇండియా స్టూడెంట్ అసోసియేషన్( ఏఐఎస్ఏ)రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్‌లో ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఐఎస్ఏ) రాష్ట్ర ఉపా ధ్యక్షులుగా అన్నమయ్య జిల్లా నుండి ఏఐ ఎస్ఏ జిల్లా అధ్యక్షులు తుమ్మల లవకుమార్ ను రాష్ట్ర కమిటీ ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి కడప జిల్లా, అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం అనేక పోరాటాలు నిర్వహించామన్నారు. ఇది గమనించిన రాష్ట్ర నాయకత్వం మరో బాధ్యతను నాకు అప్పగించడం జరిగిందన్నారు. నా మీద నమ్మకంతో నాకు ఈ బాధ్యతలు అప్పగించిన సిపిఐ(ఎంఎల్)లిబరేషన్ పార్టీ రాష్ట్ర నాయకత్వానికి ధన్యవాదాలు తెలుపుకుంటూ, భవిష్యత్తులో సంఘ నిర్మాణానికి కృషి చేస్తూ, విద్యా వ్యతిరేక విధానాలపై పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహించడానికి కార్యాచరణ తయారు చేస్తామని తెలియజేశారు.

## అన్నమయ్య జిల్లా నూతన ఎస్పీగా

# బాధ్యతలు స్వీకరించిన ధీరజ్ ఐపీఎస్



**అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం, సెప్టెంబర్13:** అన్నమయ్య జిల్లా కొత్త ఎస్పీగా ధీరజ్ ఐపీఎస్ నియమితులయ్యారు. శు క్రవారం ఆయన బాధ్యతలు స్వీకరించి, జిల్లా శాంతి భద్రతల పరిరక్షణకు కట్టుబడి పనిచేస్తానని తెలిపారు. నేరాల నివారణ, మహిళా భద్రత, గంజాయి నిర్మూలన, రోడ్డు ప్రమాదాల తగ్గింపుపై ప్రత్యేక దృష్టి సారిస్తానని ధీరజ్ స్పష్టం చేశారు. ప్రజలతో సత్సంబంధాలు ఏర్పరుచుకుని, అందుబాటులో ఉంటూ అన్నమయ్య జిల్లాకి మరిన్ని సేవలు చేస్తానని తెలిపారు.

# వెట్టి ఆవుల నుండి రైతులను పత్తికొండ ప్రజలను కాపాడండి

**- పత్తికొండ గ్రామ రైతులు ఆవేదన**

**- సీపీఎం మద్దతు**



**పత్తికొండ టౌన్ - సూర్య వాస్తవం, సెప్టెంబర్ 13:** పత్తికొండ పట్టణంలో ఆవులు విచ్చలవిడిగా తిరుగుతూ ట్రాఫిక్కు ఇబ్బందులు పెడుతూ మనుషుల ప్రాణాలు పోయేటటువంటి పరిస్థితి కూడా ఈ ఆవుల నుంచి పత్తికొండలో ఇబ్బందులతో ఉన్నామని అదేవిధంగా గ్రామ శివారులో ఉన్నటువంటి పొలాలు లోకి వెళ్లి పండిన పంటలు నాశనం చేసి వేల రూపాయలు నష్టం కలిగిస్తున్నాయని రైతులు ఆవేదన చెందుతూ సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో పత్తికొండ పోలీస్ స్టేషన్ కి వెళ్లి సిఐ జయన్నకు వినతిపత్రం ఇచ్చారు ఈ సందర్భంగా సిఐ జయన్న మాట్లాడుతూ రైతులతో ఒక ప్రకటన చేస్తూ సోమవారం 10 గంటలకల్లా ఆవులను యజమానులు ఎవరైనా ఉంటే ఆవులను తమ ఇంటిదగ్గర కట్టేసుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేస్తూ అలాగే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సాయంత్రం వెట్టి ఆవులు గోశాలకు తరలిస్తామని ఆవుల యజమానులకు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతులు సిపిఎం మండల కార్యదర్శి, చక్రాల వెంకటేశ్వర్ రెడ్డి, సిఐటియు మండల కార్యదర్శి రవిచంద్రతో పాటు రామాంజి రంగన్న, రామరాజు, భీమా, సీను, కాశి, వీరేష్, కే.రామంజి నాగరాజు 30 మంది రైతులు పాల్గొన్నారు.

# ఘనంగా వేమూరి మహిత పుట్టినరోజు వేడుకలు



**విజయవాడ- సూర్య వాస్తవం, సెప్టెంబర్ 13:** ప్రముఖ వ్యాపారవేత్త నర్వనేని మురళి మనవరాలు మహిత రెండవ పుట్టినరోజు వేడుకలు పట్టణ శివారు చౌదరి పేట మురళి గార్డెన్స్‌లో ఘనంగా నిర్వహించారు. బంధుమిత్రుల సమక్షంలో కేక్ కటింగ్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నర్వనేని మురళి, కళావతి దంపతులు, మహిత తల్లిదండ్రులు డాక్టర్ వేమూరి నవీన్ , వినీత, తాతయ్య వేమూరి శివాజీ దంపతులు, నర్వనేని శ్రీనివాస్ దంపతులు, నర్వనేని మిత్ర బృందం తదితరులు పాల్గొన్నారు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 ( ASSOCIATE EDITOR -N.ARIF ALI )